ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 | సంచిక : 9 | మే 2007

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-01-2007, హైదరాబాద్

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎంత చదువు ఉన్నా, ఎంత ఐశ్వర్యం ఉన్నా నాకు చదువు ఉంది, ఐశ్వర్యం ఉంది శాంతి అక్కరలేదు అని ఎవడూ అనుకోడు. ఎందుచేతనంటే తన స్వరూపంలో ఉన్నది శాంతేగాని ఐశ్వర్యం కాదు. జన్మలు కాని, పునర్జన్మలుగాని, ఐశ్వర్యంగాని, చదువుకాని ఇవి అన్నీ మన స్వరూపంలో లేవు, ఇవి అన్నీ మనం కల్పించుకొన్న గొడవలే. చెడ్డ పనులు చేస్తే చెడ్డ కర్మ అనుభవించటం, మంచి పనులు చేస్తే మంచి కర్మలు అనుభవించటం ఇవన్నీ మనోదేహములకు సంబంధించిన గొడవలేగాని మన స్వరూపంలో ఏమీ లేవు. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోండి. జన్మాంతర సంస్కారమును బట్టి ఎవరి పద్ధతిలో వారు సాధన చేసుకోండి. సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకోకుండా మీరు ఎన్ని సాధనలు చేసినా అశాంతి నశించదు, ఇది బాగా గుర్తుపెట్టుకోండి. మీరు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి, విచారణ చెయ్యండి. మీరు ఎన్ని సాధనలు చేసినా సబ్జక్టు మీకు ప్రోపర్‌గా అవగాహనలోనికి రాకపోతే మీకు అజ్ఞానం నశించదు. మనం సినిమా చూస్తూ ఉంటాము. సినిమా చూసినంతసేపు ఇంట్లో గొడవలు జ్ఞాపకంరావు, మనకు ఏదైనా అశాంతి ఉన్నా జ్ఞాపకం రాదు. తరువాత మరల మన గొడవలు, అశాంతి వచ్చేస్తాయి. జపం చేసినప్పుడు మనస్సు అణుగుతుంది. అప్పుడు దుఃఖం గొడవ, అశాంతి గొడవ ఉండదు. తరువాత మీకు దుఃఖం వచ్చేస్తుంది, అశాంతి వచ్చేస్తుంది. మీకు అశాంతి వచ్చినా, దుఃఖం వచ్చినా, ఉద్రేకం వచ్చినా, డిప్రెషన్ వచ్చినా ఇవన్నీ కూడా తలంపులోనుండి వస్తున్నాయి. అయితే ఈ తలంపులు ఎక్కడ నుండి

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 32
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

హైదరాబాద్ ...... 08-01-07
అప్పనపల్లి .......... 28-01-07
గొల్లలమామిడాడ 28-03-07
ముమ్మిడివరం .... 31-03-07

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

వస్తున్నాయి అంటే దేహము నేను అనే మొదటితలంపులో నుండి ఈ తలంపులు అన్నీ వస్తున్నాయి. అందుచేత దేహము నేను అనే తలంపు నశించకుండా, మీరు చేసే సాధనల వలన తాత్కాలికంగా మనస్సు అణిగినా మీకు పరిపూర్ణమైన శాంతి, శాశ్వతమైన సుఖం కోటిజన్మలు ఎత్తినా మీకు దొరకదు, అది భగవాన్ సిద్ధాంతం. రమణమహర్షిగారు జీవితం పొడుగునా చెప్పిన బోధ అది. ఇది మీకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. జన్మాంతర సంస్కారమును బట్టి అందరికీ ఆ మెంటల్ మేకప్ ఉండకపోవచ్చు. రమణమహర్షి ఒక్కడే మహాత్ముడు అని మేము చెప్పటం లేదు. ప్రపంచంలో అనేకమంది మహాత్ములు, యోగులు ఉన్నారు. మీ మెంటల్ మేకప్‌కు ఏదైతే కుదురుతోందో, ఏదైతే మీ మనస్సు ఇష్టపడుతోందో ఆ మార్గాన్ని ఫాలో అవ్వండి, మీరు తరించటం ముఖ్యం.

దేహమే నేను, దేహమే సత్యం, దేహమే ఆత్మ అనే బుద్ధి వేరుతోసహా నశించేవరకూ ఏ జీవుడినీ అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు. మనం ప్రాణాయామం చెయ్యవచ్చు, యోగాభ్యాసాలు చేయవచ్చు, అనేక అభ్యాసాలు ఉన్నాయి. ఇవన్నీ చెయ్యవచ్చు. కాని మనిషికి అక్కడ దేహబుద్ధి నశించిందా, లేదా అది చూసుకోవాలి. ఈ దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం లోకంలో ప్రతీ గొడవ తాలుక యిన్‌ఫ్లూయన్స్ మీ మెదడు మీద పడుతూ ఉంటుంది. అయితే ఏదోరోజు మీ హృదయంలో ఉన్న శాంతి మీకు అందింది అనుకోండి, దానిగురించి ఇతరులకు చెప్పటానికి మీ మెదడులో ఉన్న భాషకు అది అందదు. మనం తలంపు వచ్చాక మాట్లాడతాము, తలంపు వచ్చాక పని చేస్తాము, అయితే ఈ తలంపులన్నీ దేహము నేను అనే తలంపులో నుండి వస్తున్నాయి అని మిస్ అయిపోతున్నాము, ముందు అది మనకు తెలియాలి, దానిని మూలంతో సహా కట్ చేయకుండా మనకు శాంతి రాదు. మనం దేహం కేంద్రంగా పెట్టుకొని జీవిస్తున్నంతకాలం మీరు ఏ మతస్థులైనా, ఏ కులస్థులైనా మీకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తూ ఉంటారు, అందులో కలిసిపోయాము అనుకోండి, ఇంక మనం ఫెయిల్ అయిపోతాము, మనం మార్గం తప్పిపోతాము. సాధనలో మీరు అభివృద్ధిలోనికి రావాలంటే మనం మనంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. మన దగ్గర పది కేజీల వంకాయలు ఉన్నాయి అనుకోండి, ఆ వంకాయలు బంగారపు షాపులోనికి పట్టుకొనివెళ్ళి ఏమండి ఈ వంకాయలు తీసుకొని ఒక కాసు బంగారం ఇవ్వండి అంటే వాడు ఇవ్వడు. కాసు బంగారం ఎంతవిలువో అంత చెల్లించకుండా పది కేజీల వంకాయలకు బంగారం ఇవ్వడు. అలాగే దేహభావన అనే మూల్యం చెల్లించకుండా మీకు ఆత్మానందం రాదు. సాధన మీ ఇష్టం వచ్చినట్లు చేయవచ్చు. దేహబుద్ధి అనే మూల్యం చెల్లించకుండా నీకు ఆత్మబుద్ధి కలుగదు. ఆ మూల్యం మనం

చెల్లించవలసిందే. నా దగ్గర పది కేజీల వంకాయలు ఉన్నాయి, ఇవి తీసుకొని కాసు బంగారం ఇవ్వమంటే ఆ కొట్టువాడు ఎలాగ ఇవ్వడో అలాగే దేహభావన నశించకుండా నీకు శాంతి కావాలంటే శాంతిని ఈశ్వరుడు ఇవ్వడు.

అన్నీ భగవంతుడే చేయిస్తున్నాడు అని అంటున్నారు కదా అటువంటప్పుడు తాను చేసేపనికి మనిషి ఎందుకు ప్రతిఫలం అనుభవించాలి. అన్నీ భగవంతుడే చేస్తున్నప్పుడు నేను చేస్తున్న పనికి నేను ఎందుకు దుఃఖపడాలి. నేను ఏదైనా మంచి చేసినా, చెడ్డ చేసినా అది భగవంతుడి ప్రేరణ లేకుండా చేయలేదు కదా. అంతా భగవంతుడే చేయిస్తూ ఉంటే నాకు ఎందుకు దుఃఖం వస్తోంది అంటున్నాడు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే అంతా భగవంతుడే చేయిస్తున్నాడు అని నువ్వు నోటితోటి అంటున్నావు, నువ్వు చెబుతున్నది నిజమేకాని దాని తాలుక అనుభవం నీకు లేదు. ఆ వాక్యం అనుభవంలో లేక నేను కర్తను అనుకొంటున్నావు, అప్పుడు దుఃఖం వస్తోంది. నేను కర్తను అనుకోవటం వలన ఎత్తుకు ఎత్తు అనుభవిస్తున్నాడు, చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు ప్రతీ చిన్న విషయం కూడా ఈశ్వర సంకల్పమే, అందులో సందేహం లేదు. అందరి హృదయాలలో చైతన్యంగా ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. అయితే ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే కర్తృత్వంలో నుండి విడుదల పొందకపోతే కోటి జన్మలకు కూడా హృదయంలో ఉన్న చైతన్యం అనుభవంలోనికి రాదు, ఆ క్లూ మీకు అర్థమవ్వాలి. చైతన్యం తాలుక అనుభవం నీకు వచ్చాక చేసేది అంతా అదే, ఆడించేది అదే ఆడేవాడిని నేను అని నీకు తెలుస్తుంది, అప్పుడు దుఃఖం నశిస్తుంది. కొంతమందికి డబ్బు ఎలా ఉంటుందో, పాండిత్యం ఎలా ఉంటుందో అలాగ కొంతమందికి మహిమలు చేసే శక్తి ఉంటుంది. ఆ మహిమలు చేసేవాడు కూడా లోపల శాంతిగా ఉన్నాడా అంటే ఉండడు. అటువంటప్పుడు వాడు ఆ మహిమలు ఏం చేసుకొంటాడు, చివరకు వాడికి అశాంతి మిగులుతుంది, అజ్ఞానాన్ని పోగుచేసుకొంటాడు. అందుచేత నిజమైన సిద్ధి శాంతి మాత్రమే. శాంతి తాలుక సిద్ధి నీకు లేకపోతే ఎన్ని సిద్ధులు ఉన్నా నువ్వు సుఖపడవు. మనం కర్తృత్వం విడిచిపెట్టకపోతే మన హృదయంలో ఉన్న ఆత్మ మనకు అందదు. అందుచేత మనం కర్తృత్వం తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి.

మనం చేసే స్నేహాలు, చదివే గ్రంథాలు, మనం ఉన్న వాతావరణం అంతా మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి అనుకూలంగా ఉందో, లేదో చూసుకొంటూ ఉండాలి. అసలు మనకు ఉన్న విశ్వాసం నిజమైతే, విశ్వాసంలో కనుక దోషం లేకపోతే మొత్తం అంతా గురువే చేసేస్తాడు. లోపల నుండి ప్రేరణ ఇచ్చేది, నా చేత పనులు చేయించేది

అంతా భగవంతుడే, నేను నిమిత్తమాత్రుడను కదా మరి నాకు ఎందుకు దుఃఖం వస్తోంది అని మరల అడుగుతున్నాడు. పనులన్నీ భగవంతుడే చేయిస్తున్నాడు అని నువ్వు అంటున్నావు, బాగానే ఉంది, ఆ మాటలు నువ్వు దుఃఖంగా ఉన్నప్పుడు చెపుతున్నావా? సుఖంగా ఉన్నప్పుడు చెపుతున్నావా? దేవుడు వలననే మేము ఇలా ఉన్నాము అని నీవు సుఖంగా ఉన్నప్పుడు ఎప్పుడైనా అనుకొన్నావా? అనుకోవటం లేదు. దుఃఖంలో ఉన్నప్పుడు దేవుడు ఇలా చేసాడు అనుకొంటున్నావు. శాంతిగా ఉన్నప్పుడు, సుఖంగా ఉన్నప్పుడు దేవుడు అసలు నీకు గుర్తుకు రావటం లేదు. నేను చెప్పాను అని మీరు నమ్మనక్కరలేదు. మీ అనుభవంలో కూడా చూసుకోండి. జాగ్రత్తగా పరిశీలన చేస్తే మీకు తెలుస్తుంది. ఇదంతా దేవుడే చేస్తున్నాడు అనే నమ్మకం, విశ్వాసం నువ్వు ఎల్లవేళల కాపాడుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీవు చెప్పేవాక్యం మీద నీకు నమ్మకం ఉంటే, అది నీకు అర్థమైతే సాధనతో నిమిత్తం లేకుండా నీకు దుఃఖం నశిస్తుంది. సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా సమానంగా ఉండమని పరమాత్మ చెప్పాడు కాని మీరు ఉండలేరు ఎందుచేతనంటే అక్కడ దేహము నేను అనే తలంపు ఉంది కాబట్టి ఉండలేరు. వెంకటేశ్వరస్వామి దీక్ష తీసుకోమని కొందరు, అయ్యప్ప దీక్ష తీసుకోమని కొందరు, దుర్గ దీక్ష తీసుకోమని కొందరు చెపుతూ ఉంటారు. మీరు దీక్షలు తీసుకోండి, దీక్షలు తీసుకోవద్దని నేను చెప్పటం లేదు. అసలు బేసిక్‌గా దేహము నేను అనే తలంపు ఉన్నప్పుడు మీరు అజ్ఞానంలో నుండి బయటకు రాలేరు. దేహబుద్ధి ఉన్నప్పుడు సుఖదుఃఖాల యొక్క తాకిడి, ద్వంద్వాల యొక్క వేగం మీ మనస్సు మీద పడకుండా ఆపలేరు.

మేము ఏదో సాధన చేసేస్తున్నాము, మిగతా వారు వెనుకబడిపోయారు, మేము జ్ఞానం సంపాదించుకొన్నాము, మిగతావారు అజ్ఞానంలో ఉన్నారు అని ఇటువంటి పిచ్చి గొడవలు పెట్టుకొంటే మీరు పూర్తిగా పాడైపోతారు. వారికంటే మీరు గొప్పని ఎవరు చెపుతున్నారు? మీ అహంకారం చెపుతోంది. అంటే సాధన పేరు చెప్పి నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలను కొంటున్నావో దానిని పెంచుకొంటున్నావు. అహంకారం ఏమి చేస్తుంది అంటే ఒక రూపంలో దానిని కనిపెట్టాము అనుకోండి, ఈ రూపంలో కనిపెట్టేసారు అని ఆ రూపం మార్చి ఇంకో రూపంలోనికి వచ్చేస్తుంది. మరల ఆ రూపాన్ని పట్టుకోవటానికి కొన్ని వందల జన్మలు పడుతుంది. దేహంతో తాదాత్మ్యం పొందే నేనును విడిచిపెట్టటమే నిజమైన త్యాగం. అదే నిజమైన యోగం, అదే నిజమైన తపస్సు. దానిని విడిచిపెట్టు. దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తూ ఎవడికైనా ఒక అరటిపండు ఇచ్చావు అనుకో, దాని వలన నీకు పుణ్యం వస్తుంది కాని అజ్ఞానం నశించదు. మీ మనస్సులో ఎవరి మీద ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి. ఇంక మీ మనస్సు కదలదు. అసలు సాధనతో సంబంధం

లేకుండా మీ మనస్సు 90% ఆగిపోతుంది. నా దుఃఖం ఎప్పుడుపోతుంది అని వీడు మరల అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నాకో శరీరం ఉందని, ఆ శరీరమే నేను అనే భావన నీకు ఉన్నంతకాలం నీకు దుఃఖం నశించదు. మంచిపనులు, చెడ్డపనులు భగవంతుడే చేయిస్తున్నాడు అంటున్నావు కదా. నీకు మంచి పనులు చేస్తే సంతోషం వస్తోంది, చెడ్డ పనులు చేస్తే దుఃఖం వస్తోంది. అన్నీ దేవుడే చేస్తున్నాడు అనుకొన్నప్పుడు మరి నువ్వు ఎందుకు సంతోషిస్తావు, ఎందుకు దుఃఖపడుతున్నావు అంటున్నారు భగవాన్. ఈ సంతోషం, దుఃఖం గొడవ నీకు ఏల? దేవుడే చేయిస్తున్నప్పుడు ఆ సంతోషం ఏదో దుఃఖం ఏదో ఆయనే పడతాడు, నీకు ఎందుకు? వాటితో నీకు సంబంధం ఏమిటి? ఏ పని అయినా చేసినవాడే అనుభవిస్తాడు. అందుచేత దేవుడు అన్నీ చేస్తూ ఉంటే ఆ సుఖాన్ని, దుఃఖాన్ని ఆయనే అనుభవిస్తాడు, ఆ తంటాలు ఆయనే పడతాడు, ఆ గోల నీకు ఎందుకు? నువ్వు ఊరక ఉండు, నువ్వు ఏమీ నొల్లుకోవద్దు, నువ్వు శాంతిగా ఉండు. దేవుడే అంతా చేస్తున్నాడు అని వాడు నోటితో అన్నా కర్తృత్వం ఉన్నప్పుడు మనం ఎంత చెప్పినా దుఃఖం నశించదు. కాని భగవాన్ అటుఇటు తిప్పి ఎందుకు చెపుతున్నారు అంటే కొంత సబ్జక్టు వాడికి అర్థమవ్వటం కోసం అలా చెపుతున్నారు.

అజ్ఞానం ఉన్నంతసేపు మనస్సు వెళ్ళి హృదయం అనే గూటిలో పడదు. మనస్సు హృదయంలోనికి వెళ్ళి అక్కడ కరగనంతకాలం నీకు దుఃఖం తప్పదు, సుఖం తప్పదు, చావు తప్పదు, పుట్టుక తప్పదు. హృదయంలోనికి వెళ్ళి మనస్సు నిలబడితేగాని అది నశించదు, ఇది మాటలతో పరిష్కారం అయ్యేది కాదు. మీకందరికీ ఈశ్వరుడు నిజంగా ఆత్మజ్ఞానం యిచ్చినా మీరు అడ్డుకొనేలాగ ఉన్నారు. ఎందుచేతనంటే మనకు ఉన్న అజ్ఞానమే నిజం అనుకొంటున్నాము, మన దేహమే నిజం అనుకొంటున్నాము, వాడు ఏదో నిజం కానిది యిచ్చేస్తున్నాడేమో అనుకొంటాము, ఆయన నిజంగా ఇచ్చినా రిజెక్టు చేస్తాము. ఎందుచేతనంటే ఆయన ఇచ్చేది అబద్ధం అనుకొంటున్నాము, మనం అనుకొనేది నిజం అనుకొంటున్నాము. ఆయన ఇచ్చేది మనం స్వీకరించటానికి కొంత ప్రిపరేషన్ అవసరం. మనకు వాసన నశించదు అనుకోండి. మనస్సును హృదయంలోనికి పంపినా తాత్కాలికంగా అక్కడ ఉండి మరల బయటకు వచ్చేస్తుంది. వాసన మనస్సును హృదయంలో ఉండనివ్వదు, బయటకు లాక్కొని వచ్చేస్తుంది. అప్పుడు మనకు భక్తి అవసరం. భక్తి ఉంటే వాసన పలుచబడుతుంది. ఎప్పుడైతే వాసనలు తగ్గిపోతున్నాయో అప్పుడు మనస్సు హృదయంలో ఎక్కువసేపు నిలబడి ఉంటుంది, అప్పుడు మనస్సు నశిస్తుంది. భక్తి అంటే మీరు చిన్న విషయం అనుకొంటున్నారు. భక్తి అంటే సామాన్యం కాదు, ఈశ్వరుని దయ లేకుండా

గురువు యొక్క దయ లేకుండా భక్తి కుదరదు, భగవంతుడు ఈ శరీరాన్ని ఎప్పుడైతే భూమి మీదకు పంపాడో అంటే పుట్టినరోజు ఎప్పుడు వచ్చిందో అప్పుడే చనిపోయే రోజు కూడా నిర్ణయించి పంపుతాడు. మనం మధ్యలో ఏదో చనిపోవటం కాదు, ఈ రోగాలు అన్నీ వంపులే. అందరికీ మంచి ఉద్యోగాలు ఇచ్చావు, నాకు చెడ్డ ఉద్యోగం ఇచ్చావు, అందరినీ చంపే పని నాకు ఇచ్చావు, అందరూ తిట్టుకొంటారు అని యమధర్మరాజు మహావిష్ణువును అడిగాడు. అప్పుడు విష్ణువు ఏమన్నాడు అంటే నిన్ను ఎవడూ తిట్టడు, ఏ మనిషి రోగం లేకుండా చావడు, ఏదో కారణం ఉంటుంది. ప్రాణం తీసేది నువ్వే, నువ్వు చేసేపని చేసుకో, వారు నిన్ను తిట్టరు, ఆ రోగాలను, కారణాలను తిట్టుకొంటారు. రోగం అనేది వంపు, ప్రాణం ఎవడైతే పోసాడో వాడే తీస్తాడు. అది నిర్ణయించబడి ఉంటుంది. ఈలోపుగా మనం కంగారుపడినా ఆ దేహం ద్వారా జరగవలసిన పనులు పూర్తయ్యేవరకూ మనలను చావనివ్వడు. మన ఇంట్లో ఎవరైనా చనిపోతే మనకు దుఃఖం వస్తుంది. ఆ దుఃఖం ఆపు చేసుకోవాలి అని అనుకొన్నా దుఃఖం వచ్చేస్తూ ఉంటుంది. మీలో దుఃఖపడేవాడు ఉన్నంత కాలం దుఃఖం ఆగదు, వచ్చేస్తూ ఉంటుంది. దేశంలో అనేకమంది చనిపోతున్నారు అప్పుడు నీకు దుఃఖం రావటం లేదు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే దుఃఖం వస్తోంది, ఎందుకు వస్తోంది అంటే అది మమకారంలో నుండి వస్తోంది. అది ఉన్నంతసేపు మీకు పునర్జన్మ వచ్చేస్తుంది.

మన రంగులు తేడా, గుణాలు తేడా, రూపాలు తేడా కాని హృదయంలో ఉన్న వస్తువు ఒక్కటే. మీ మనస్సులో కల్మషం ఉంటుంది కాని హృదయంలో కల్మషం ఏమీ ఉండదు. గాఢనిద్రలో మనం అందరం సమానంగా ఉన్నాము. ధనవంతులు మేము ధనవంతులం అని గాఢనిద్రలో అనుకోరు, పేదవాళ్ళు మేము పేదవారము అని అనుకోరు. గాఢనిద్రలో మనం ఎలా ఉన్నామో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాము. అది మనకు తెలియకపోవటం వలన మనం దేహముతో మనస్సుతో కలిసిపోవటం వలన భిన్నభిన్నంగా ఉన్నాము అని మనకు అనిపిస్తుంది. మన హృదయంలో ఉన్నది ఆనందమే. మనం ఏదిగా ఉన్నామో ఆ వస్తువులో మటుకు దుఃఖం లేదు. అయితే మీకు దుఃఖం ఎందుకు వస్తోంది, ఊహించుకోవటం వలన దుఃఖం వస్తోంది. ఊహలు ఎక్కడ ఉన్నాయి? మనస్సులో ఉన్నాయి. మనస్సు ఎక్కడ నుండి వస్తోంది? దేహము నేను అనే తలంపు నుండి వస్తోంది. ఇది నశించేవరకూ మనకు ఊహలు ఆగవు, దుఃఖం నశించదు. మీరు నన్ను శత్రువు అని అనుకోవచ్చు, దాని వలన నాకు నష్టం ఏమీ లేదు. మీరు నాకు శత్రువులు అని నేను అనుకోకుండా ఉంటే చాలు. మీ గోల నా గోల కింద చేసుకోవటం మొదలుపెట్టాను

అనుకోండి, అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. మీకు నిజంగా భక్తి ఉంటే ఉండనివ్వండి. మీకు భక్తి ఉంది అని ఇతరులకు చెప్పవద్దు, భక్తిని అభివృద్ధి చేసుకోండి. మీ భక్తి ఇతరులకు తెలియాలి అనుకొంటే అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. మీ భక్తి ఇతరులకు తెలియాలి అని ఎవరు అనుకొంటున్నారు, అహంకారం అనుకొంటోంది, ఇంక అది పెరిగిపోతుంది, దానిని ఆపుచేయలేరు. ఫలానా కారణం వలన నాకు దుఃఖం వస్తోంది అని నీవు అనుకొంటున్నావు, అది అబద్ధం. నీకు దేహభావన పోయినప్పడు ఆ కారణం ఉన్నా దుఃఖం రాదు. మా అబ్బాయి నేను చెప్పినమాట వినటం లేదు, నాకు దుఃఖం వస్తోంది అంటారు. నీకు దేహంతో ఉన్న తాదాత్మ్యం వలన వాడు మా అబ్బాయి అనుకొంటున్నావు. వాడు నేను చెప్పిన మాట వినాలి అనుకోవటం వలన దుఃఖం వస్తోంది. మీకు దేహంతో తాదాత్మ్యం పోయింది అనుకోండి మీరు చెప్పిన మాట వాడు వినకపోయినా దుఃఖం రాదు. వాడి శరీరాన్ని మీరు కన్నారు కాని వాడి ప్రారబ్ధాన్ని మీరు కనలేదు. పిల్లలు చిన్నప్పడే తల్లితండ్రులు పోయిన వారు ఉన్నారు, ఎక్కడో బంధువుల ఇంటి దగ్గర పెరిగి జడ్జీలు అయినవారు ఉన్నారు, ఎవరు చూసారు వారిని? మీకు దేహంతో తాదాత్మ్యం వలన దుఃఖం వస్తోంది. మా అబ్బాయి నేను చెప్పిన మాట వినటం లేదు దుఃఖం వస్తోంది అన్నమాట నిజంకాదు. ఒకవేళ మీ అబ్బాయి మీరు చెప్పిన మాట వింటే మీకు సంతోషం వస్తుంది. ఆ సంతోషం కూడా దేహభావనలో నుండే వస్తోంది. ఇంట్లో మనుషులు సంసారం కాదు, ఇలా అనుకోవటాలే సంసారం. నీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా, అశాంతి వచ్చినా దేహము నేను అని భ్రమించటం వలననే అది వస్తోంది. ఆ తప్పడు తాదాత్మ్యంలో నుండే భ్రమ వస్తోంది. నీకు బయట కనిపించే కారణాలు నిజం కాదు. అది నశించేవరకూ ఏదో రూపంలో దుఃఖం నిన్ను వెంటాడుతుంది.

కొంతమందికి ఏమి ఆస్తులు లేకపోయినా, సాయంత్రం భోజనం ఎలాగ వెళుతుందో తెలియకపోయినా చాలా ఆనందంగా ఉంటారు. కొంతమంది వందకోట్లు డబ్బు సంపాదించినా ఏడుపుమొఖాలతో ఉంటారు. మీ సంపాదన మీకు ఏడుపును యిస్తూ ఉంటే ఆ సంపాదన ఏమి చేసుకొంటారు. మొన్న కాకినాడలో మేము సోముప్రసాద్ అని ఒకరి ఇంటికి వెళ్ళాము. ఆయన మందులు ఇంజక్షన్లు వ్యాపారం చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఆయన చిన్నప్పడు సైకిలుకు డబ్బా కట్టుకొని ఊళ్ళు తిరుగుతూ బిస్కట్లు అమ్ముకొంటే రోజంతా కష్టపడితే రెండు రూపాయలు వచ్చేదట. ఆ రెండు రూపాయలలో ఎవరికైనా ఇడ్లీ, కాఫీ ఇప్పించేవాడట. డబ్బు ఉండి ఇప్పించటం కాదు, అది ఆయన స్వభావం. ఇప్పడు కాకినాడలో లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఆయన సంపాదనను మూడు

భాగాలు చేసి అందులో రెండు భాగాలను ప్రజలకు పంచి పెడుతున్నాడు. ప్రజలకు కేటాయించినది ఇంక ఆయన ముట్టుకోడు, అది భగవంతుడిది అనుకొంటాడు. ఇంతకీ ఈ విషయం ఎందుకు చెపుతున్నాను అంటే ఆ చేసేది, ప్రజలకు ఇచ్చేది ఇంత ఖర్చుపెడుతున్నాము, ఇంత ప్రజలకు పంచిపెడుతున్నాము అని మనస్సులో కూడా అనుకోకుండా చేస్తున్నాడు. అంతకంటే ఎక్కువ డబ్బు ఇచ్చినవారు ఉండవచ్చు కాని ఆయన నార్మల్‌గా, నేచురల్‌గా చేస్తున్నాడు, అది ముఖ్యం. ఈశ్వరుడికి మనమీద దయ కలిగింది అనుకోండి, గురువుకు మన మీద దయ కలిగింది అనుకోండి కనురెప్పలు మూసి తెరిచేటప్పటికి హృదయంలో ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చేస్తుంది. ఈశ్వరుడి యొక్క వైభవం మనకు తెలియటం లేదు. ఈశ్వరుడి యొక్క వైభవాన్ని మన గర్వం తెలియనివ్వదు. మనకు ఏవో ఆస్తులు ఉంటాయి, వాటిని చూసుకొని, వాటితో తాదాత్మ్యం పొంది మనముందు భగవంతుడు ఎంత అనుకొంటాము. మామూలు కవులు మాట వదిలేయండి, భక్తి సాహిత్యం వ్రాసిన కవులు కూడా కొంతమంది అది త్యజించాము, ఇది త్యాగం చేసాము అని కవిత్వాలు వ్రాసారు. మురుగునార్ గొప్ప భక్తుడు, పెద్ద కవి. ఒకసారి మురుగునార్ ఆ కవులు వ్రాసిన పద్యాలు చదివి భగవాన్‌తో ఆ కవి అది త్యజించాను, ఇది త్యజించాను అని వ్రాసాడు, మీరు వ్రాసిన సాహిత్యంలో అది విడిచిపెట్టాను, ఇది విడిచిపెట్టాను అని ఏమీ వ్రాయలేదు ఏమిటి అని అడిగాడు. భగవాన్ ఏమి చెప్పారు అంటే అసలు విడిచిపెట్టటానికి నాదంటూ ఏదైనా ఉంటే కదా అన్నారు. నాదంటూ ఏదైనా ఉంటే పోనీ అది విడిచిపెట్టాను అని కవిత్వం వ్రాసేవాడిని, నాదంటూ ఏమీ లేనప్పుడు విడిచిపెట్టానని ఏమి వ్రాస్తాను అన్నారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-01-2007, అప్పనపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అప్పనపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రం. స్వామి అంటే సొత్తు కలవాడు, ఈ సృష్టికి యజమాని ఆయనే. ఈ లోకం మీది, నాది కాదు, మనం మధ్యలో వచ్చాము, మధ్యలో వెళ్ళిపోతాము. మీ వస్తువులను మీరు ఎలా జాగ్రత్తగా చూసుకొంటారో అలాగ ఈ సృష్టినంతా ఆయన జాగ్రత్తగా చూసుకొంటాడు. మీ వస్తువులను జాగ్రత్తగా చూసుకోమని మేము చెప్పనక్కరలేదు, మీరు బాగానే చూసుకొంటారు. ఈ లోకాన్ని మనం ఉద్ధరిస్తున్నాము, మనం ఉద్ధరిస్తున్నాము అనుకొంటాము కాని ఉద్ధరించటానికి మనం అంటూ లేము, అంతా ఆయనే చూసుకొంటాడు. మనం ఆయన చేతిలో పనిముట్లుగా ఉంటాము అంతే. ఒకవేళ

మన ద్వారా ఏదైనా మంచి పని జరిగినా ఆయన చేయించిందేగాని మన వలన ఏమీ కాదు. ఆ తలంపు తీసుకొని వచ్చిన వాడు ఆయన, మనకు చేసే శక్తిని ఇచ్చినవాడు ఆయన, మనచేత చేయించినవాడు ఆయన, మనం అంటూ లేము. ఉన్నాము అని అనుకోవటం వలన మనం పాడైపోతున్నాము. భగవంతుడు అనేక రూపాలలో ఈ లోకంలోనికి వస్తాడు. భగవంతుడు ఏ రూపంలో వచ్చినా భక్తుడు ఆయనను గుర్తించగలడు కాని భక్తుడు కాని వాడు గుర్తించలేడు. భక్తిని మనం కల్టివేట్ చేసుకోవాలి. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, అనేక భోగాలు ఉన్నాయి. భగవంతుడి పాదాలయందు భక్తి కలిగే వరకూ మనం ఎంత కాదనుకొన్నా ఈ భోగాలనుండి, ఆకర్షణల నుండి, విషయాల నుండి, తలంపుల నుండి బయటకు రాలేము. భగవంతుడి పట్ల భక్తి, ఆ రుచి దొరికే వరకూ బయట గొడవలలో నుండి విడుదల పొందటం కష్టం. నువ్వు అంతటా ఉన్నావు, నా హృదయంలో ఉన్నావు. నువ్వు లేవా అంటే ఉన్నావు, నువ్వు ఇంద్రియాలకు అందవు, మనస్సుకు అందవు, సూక్ష్మాతిసూక్ష్మంగా ఉన్నావు. అట్టి నిన్ను గ్రహించటానికి, నిన్ను అనుభవైకవేద్యం చేసుకోవటానికి ఏ తలంపులైతే, వాసనలైతే అడ్డు వస్తున్నాయో అవి ఎప్పుడు ఆగిపోతాయి, నాలోని బలహీనతలు ఎప్పుడు ఆగిపోతాయి అరుణాచలా అంటున్నారు భగవాన్.

మనం దేహం కాకపోయినా, మనస్సు కాకపోయినా దేహంగా ఉండి, మనస్సుగా ఉండి నటించటం నేర్చుకొన్నాము, మన జీవితం అంతా కృత్రిమం. మనం అందరం ఇలా నటిస్తూ ఉంటాము. ఏదో రోజు ఈ దేహం చనిపోతుంది. మనం వంద సంవత్సరాలు బతికితే చివరి రోజు వరకు కూడా మనం పాఠాలు నేర్చుకొంటూనే ఉండాలి అని శాస్త్రంలో చెప్పారు. అంటే చివరి రోజు వరకు మనం నేర్చుకొంటూ ఉంటేనే కాని మనం బాగుపడము, మనలను మనం సంస్కరించుకోలేము. ఇల్లుని చక్కబెట్టుకోవటం తెలికే కాని మనస్సును చక్కబెట్టు కోవడం చాలా కష్టం. ఇల్లు దులుపుకోవటం తేలిక, మనస్సును దులుపుకోవటం చాలా కష్టం. మనలను మనం పవిత్రం చేసుకోవటానికి, బాగుచేసుకోవటానికి ఎన్నో విషయాలు ఈ లోకంలో మనం నేర్చుకోవాలి, జీవితంలో చివరి రోజు వరకు మనం నేర్చుకొంటూనే ఉండాలి. పర్వతరాజు కుమార్తె అయిన పార్వతి ఒక రోజు తన వైభవాన్ని తండ్రికి చూపించాలనుకొంది. అనేక మహిమలు చేసి తండ్రికి చూపించింది. ఇవన్నీ చూపించావు చాలా బాగుంది కాని నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించు అన్నాడు పర్వతరాజు. ఆయన కూతురుతో ఏమన్నాడు అంటే ఈ మహిమలకు ఏముందిలే, మనోదేహములతోటి, ఈ లోకంతోటి సంబంధంలేని సుఖాన్ని, శాంతిని ప్రసాదించు అన్నాడు. అది నాకు చేతకాదు అని పార్వతి స్పష్టంగా చెప్పింది. నువ్వు సత్పురుషుల సహవాసం చెయ్యాలి, సజ్జన సాంగత్యం

చెయ్యాలి, నీ పూర్వ పుణ్యం వలన తగిన గురువు నీకు దొరకాలి. ఆ గురువు దగ్గర నీవు ఆత్మజ్ఞానం యొక్క వైభవాన్ని శ్రవణం చెయ్యాలి. నీవు దానిని మననం చెయ్యాలి. ఇన్ని కలిసి వస్తే గురువు అనుగ్రహం వలన నీవు ఆత్మజ్ఞానం పొందే అవకాశం ఉంటుంది కాని అది నేను ఇచ్చేదికాదు, నీవు పుచ్చుకొనేదికాదు అని పార్వతి తండ్రికి చెప్పింది. మనం ఉద్యోగం ఇప్పించమని భగవంతుడిని ప్రార్థిస్తాము, అన్నం పెట్టమని అడుగుతాము, ఇంటి దగ్గర ఇబ్బందులు ఉంటే, వాటిని తీర్చమని భగవంతుడిని అడుగుతాము. వీరు అందరూ కూడా భక్తులే కాని రామకృష్ణ పరమహంస ఏమని చెప్పారు అంటే మీకు అన్నం కావాలంటే అమ్మ పెడుతోంది కదా ఎంతసేపు అన్నం గొడవ, బట్టల గొడవ ఏమిటిరా, నువ్వు భగవంతుడిని ప్రార్థిస్తే ఆత్మజ్ఞానం కోసం ప్రార్థించు అని చెప్పాడు. దేహం ఉన్నంతసేపు అన్నం అవసరమే, బట్ట అవసరమే. అన్న వస్త్రాలను అడగటం పొరపాటు అని కాదు. వీటి చుట్టూ ఎంతకాలం తిరుగుతావు. ఈశ్వరుని యొక్క దయ లేకుండా కేవలం నీ తెలివితేటల వలన హృదయంలో ఉన్న వస్తువును నీవు పొందలేవు. అడగవలసింది అడగటం మానేసి అన్నమో, అన్నమో అని ఏడుస్తావు ఏమిటి? అంటున్నాడు రామకృష్ణ. జ్ఞానం యొక్క వైభవం మీకు తెలియటం లేదు. అన్నవస్త్రాలు అవసరం లేదు అని ఆయన చెప్పటం లేదు. చనిపోయే వరకూ వాటి గొడవలేనా నీకు. నువ్వు దేవుడి దగ్గరకు వెళ్లి ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాలనా అడిగేది. అసలు ఏది అడగాలో, ఏది పొందాలో నీకు తెలియటం లేదు.

నిన్న మా ఇంటికి తూర్పుగోదావరి జిల్లా నుండి ఒక అరటికాయల వ్యాపారస్థుడు వచ్చాడు, అతడికి ఫైనాన్స్ కంపెనీ కూడా ఉంది. అతను ఏమన్నాడు అంటే నన్ను మా ఇంట్లో పెళ్లి చేసుకోమంటున్నారు. ఇంట్లో ఉంటే పెళ్లి చేసేలా ఉన్నారు, అరుణాచలం వెళ్లిపోతాను, మీ సలహా అడగటానికి వచ్చాను అని చెప్పాడు. చాలామంది ఉద్దేశ్యం ఏమిటి అంటే ఎక్కడికో పారిపోతే జ్ఞానం వచ్చేస్తుంది అనుకొంటారు. భగవంతుడు ఒకో దేహానికి ఒకో పనిని కేటాయిస్తాడు. దానిని ఇష్టంగా చెయ్యాలి, ప్రేమగా చెయ్యాలి, కోరిక లేకుండా చెయ్యాలి, ఆ పని ఎలా చెయ్యాలో తెలుసుకొని చెయ్యాలి. వ్యాపారస్థులు ఉన్నారు అనుకోండి, డాక్టర్లు ఉన్నారు అనుకోండి డబ్బో డబ్బో అని అనుకోనక్కరలేదు. వచ్చే డబ్బు వస్తుంది, మీరు చేసే పని శ్రద్ధగా, ప్రేమగా చెయ్యండి. మీరు చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, ప్రేమగా చెయ్యకుండా డబ్బో డబ్బో అనుకొంటే ఆ వచ్చే డబ్బు వెనక్కి పోతుంది. మీరు నేర్చుకోవలసింది ఏమిటి అంటే డబ్బును అడగనక్కరలేదు, దానంతట అదే వస్తుంది, వెళ్లిపోతూ ఉంటుంది. చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, ప్రేమగా చేయటం వలన డబ్బు వస్తుంది, శాంతి వస్తుంది, అమృతత్వం పొందుతారు. అరటికాయల వ్యాపారస్థుడితో ఏమని చెప్పాను అంటే నువ్వు వ్యాపారం

చేసుకో. నీ జ్ఞానానికి అరటికాయ వర్తకం అడ్డుకాదు. నీ వ్యాపారంలో ఎవరిని మోసం చేయకు, ఫైనాన్స్ కంపెనీలో ఎవరినీ మోసం చెయ్యకు, వడ్డీ రీజనబుల్‌గా తీసుకో. నీకో పొట్ట ఉంది అన్నం తినాలి కొంత డబ్బు కావాలి కదా. పెళ్ళి మానేసి అరుణాచలం వెళ్ళి అక్కడ కొంతకాలం ఉండి తిరిగి ఇంటికి వస్తే అప్పుడు పెళ్ళి చేసుకోవాలనుకొన్నా పెళ్ళి అవ్వటం కష్టం. అందుచేత నీవు పెళ్ళి చేసుకో అని చెప్పాను. పెళ్ళి చేసుకోవాలా, మానాలా అనుకొనే వాడు పెళ్ళి చేసుకోవటం మంచిది. అసలు వాడి ప్రారబ్ధంలో పెళ్ళి లేకపోతే ఆ తలంపు కూడా రాదు. పెళ్ళి చేసుకోవాలా, మానాలా అని వాడు అనుకొంటూ ఉంటే వాడికి తెలియకుండా అక్కడ పెళ్ళి తాలుక తలంపు వాడికి ఉంది, అందుచేత చేసుకోవటమే మంచిది. నీకు అరుణాచలం వెళ్ళాలి అని ఉంటే సంవత్సరానికి ఒకసారో, రెండుసార్లో వెళ్ళి పదిరోజులు ఉండాలంటే ఉండు. అంతేగాని నువ్వు ఇక్కడ చేసుకొనే కృషి వదిలేసి, పెళ్ళి చేసుకోవటం మానేసి ఎక్కడికో వెళతాను అంటే ఇహానికి, పరానికి పనికిరాకుండా పోతావు.

ఇంటి దగ్గర నుండి పారిపోతే ఏదో వచ్చేస్తుంది అనుకొంటాము, ఏమీ రాదు, పైగా కష్టాలు పెరుగుతాయి. సన్యాసం అనేది మనస్సుకు సంబంధించినది. అడవులకు వెళ్ళటం వలన, ఎక్కడికో పారిపోవటం వలన నీకు సన్యాసం రాదు. రమణమహర్షిగారి విషయం వేరు. ఆయన దేహప్రారబ్ధం ప్రకారం అక్కడ ఉండవలసి ఉంది, ఉన్నాడు. అరుణాచలం వెళదామా, వెళ్ళకూడదా అని ఆలోచించుకొని ఆయన అరుణాచలం రాలేదు, ఏదో ఒక మహత్తర శక్తి ఆయనను అక్కడకు మోసుకొని పోయింది. నేను నీతో స్నేహంగా ఉండేవాడిని, అరుణాచలం వెళ్ళిపోతున్నానని ఒక్కమాట అయినా చెప్పలేదు ఏమిటి అని ఒక స్నేహితుడు భగవాన్‌ను అడిగితే అసలు నేను ఆలోచించి వెళ్ళానా అరుణాచలం, ఏదో ఒక మహాప్రవాహంలో అలా కొట్టుకొనిపోయాను అంతే, అసలు ఆ పక్వత రావాలి కదా. నువ్వు శరీరంతో అన్ని పనులు వదిలేసి, మనస్సులో వాటిని చింతిస్తూ ఉంటే వాడు డంబాచారి, వాడు ఇహానికి పనికిరాడు, పరానికి పనికిరాడు అని పరమాత్మ చెప్పాడు. సన్యాసం అంటే ఇల్లు విడిచిపెట్టటం, బట్టలు మార్చుకోవటం కాదు, వాంఛల్ని, మమకారాన్ని విడిచిపెట్టాలి. ఎవరైనా తెలిసినవారు కనిపించారు అనుకోండి, వారితో మర్యాదగా మాట్లాడకపోవటం సన్యాసం కాదు. కొంతమంది కోపం వచ్చి అందరితో మాట్లాడటం మానేసి అదే జ్ఞానం అనుకొంటూ చివరకు పిచ్చోళ్ళు అయి చనిపోయిన వారు ఉన్నారు. ఆధ్యాత్మికవిషయం అంటే కత్తి అంచుమీద నడవటం వంటిది. జాగ్రత్తగా వెళితే వెళ్ళిపోతాము, అజాగ్రత్తగా ఉంటే కాళ్ళు తెగిపోతాయి.

రామకృష్ణపరమహంస గారు ఏమని చెప్పారు అంటే ఇప్పుడు మనం ఇంట్లో కూర్చొన్నాము, పైన కప్పు ఉంది, బయట సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుడు మనకు కనబడకుండా ఈ కప్పు అడ్డు వస్తోంది. మన లోపల సద్వస్తువు ఉన్నప్పటికి అది మనకు గోచరం అవ్వకుండా నేను అనే తలంపు, నాది అనే తలంపు మనకు కప్పు లాగ అడ్డు వస్తున్నాయి. మనో దేహములతో తాదాత్మ్యం ఉన్నంతకాలం లోపల ఉన్న వస్తువు మనకు గోచరం కాదు. గురువు మనకు కొత్తగా ఇచ్చేది ఏమీ లేదు. లోపల ఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి రాకుండా ఏ తలంపులైతే అడ్డువస్తున్నాయో వాటిని నెమ్మదిగా కాల్చి బూడిద చేస్తాడు, వాడు గురువు. మనం వివేకవంతులుగా జీవిస్తే జ్ఞానం వస్తుంది కాని మొద్దబ్బాయిలాగ జీవిస్తే జ్ఞానంరాదు. శాస్త్రంలోని ఒక మంచిమాట చెపుతున్నాను, ఇది బాగా గుర్తు పెట్టుకోండి, దేవుడి మాట ఎలా ఉన్నా లోకానుభవానికి ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఎవడైనా మనలను మోసం చేసాడు అనుకోండి. మొదటిసారి మోసం చేసాడు, మనం పడ్డాము, అప్పుడు వాడిదే తప్పు. రెండోసారి కూడా మనలను మోసం చేసాడు అనుకోండి అప్పుడు కూడా మనం మోసంలో పడితే అది వాడి తప్పుకాదు, మోసంలో పడ్డవాడిదే తప్పు అని శాస్త్రంలో చెప్పారు. అందుచేత వివేకం ముఖ్యం.

ఆచార్యులవారు భజగోవింద శ్లోకాలలో ఒకమాట చెప్పారు. లోకంలో ఏముందివయ్యా, ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్ప ఏముంది. ఉన్నదంతా నీ హృదయంలోనే ఉంది. గోవిందుడిని స్మరించుకో. గోవిందుడు అంటే కృష్ణుడు అని కాదు, వేదాంతవాక్యాలు ఏ వస్తువును అయితే పొందమని చెప్పాయో ఆ సద్వస్తువే, ఆ పరమాత్మే గోవిందుడు. గోవిందుడిని స్మరించి ఈ సంసారంలో నుండి బయటకురా. అక్కడ ఉద్ధరిస్తున్నాము, ఇక్కడ మంచి పనులు చేస్తున్నాము అని చెపుతారు. దీనికే భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు ఎవడివిరా ఉద్ధరించటానికి. నేను ఉద్ధరిస్తున్నాను అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సు చెపుతోంది? నిజంగా చేసేవాడు ఎవడూ అలా చెప్పడు. ఈ లోకంలో ఏదో కొంతమందికి ఉపకారం చేస్తున్నట్లు ఎవరైనా పైకి కనిపించినా ఇది అంతా సన్మానాల కోసం, గొప్పలకోసం, పదవుల కోసం చేసే పనులేకాని జ్ఞానంకోసం చేయటం లేదు. జ్ఞానం కోసం సత్కర్మలు చేసేవారు వేరు. వాడి ద్వారా ఇతరులకు సహాయం అందుతూ ఉంటే అది వారికి తెలియాలి అని జ్ఞాని అనుకోడు, ఎందుచేతనంటే వాడికి ఇతరులు లేరు. మీరు గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే బ్రహ్మానుభవం పొందటానికి నీకు ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి, అదే సాధన. కర్మఫల త్యాగి సన్యాసి. నువ్వు ఏ పని అయితే చేస్తున్నావో ఆ పని

తాలుక ఫలితం మీద కాకుండా, నూటికి నూరుపాళ్ళు ఆ పనిమీదే కనుక నువ్వు నీ శరీరాన్ని, మనస్సును పెట్టి చేస్తూ ఉంటే నువ్వు సన్యాసివి. ఇప్పుడు మీ కుటుంబసభ్యులు నలుగురో, ఐదుగురో ఉంటారు. మీ ప్రేమ అక్కడకు పరిమితం, మీ మనస్సు అక్కడికి పరిమితం. వాడు సత్యాన్వేషకుడు అయితే కులమతాలతో సంబంధం లేకుండా, ప్రాంతాలతో సంబంధం లేకుండా వాడి ప్రేమ విశ్వ వ్యాప్తమవుతుంది. సృష్టికంటే ప్రేమ గొప్పది. సృష్టి చాలా విశాలంగా ఉంటుంది కాని ప్రేమ అంతకంటే విశాలంగా ఉంటుంది. ఆత్మకు మరో పేరు ప్రేమ. అటువంటి ప్రేమ నీకు కలిగితే ఈ దేహాభిమానంలోనుండి నీ అంతట నువ్వే సహజంగా బయటకు వచ్చేస్తావు. మనం మాయలో పడి ఎలా కొట్టుకొంటున్నామో భగవాన్ చెప్పారు. దీపం బుడ్డికి ఒక ప్రక్కన చిన్న చిల్లు ఉంది. ఒక ఈగ అలా అలా తిరుగుతూ ఆ చిల్లులోనుండి దీపం బుడ్డిలోనికి వచ్చేసింది. బుడ్డి లోపల అలా అలా తిరుగుతోంది. బయటకు వెళ్ళలేక పోతోంది, జైలులో పడ్డాము అనుకొంటోంది, అది ఏ రంధ్రం గుండా లోపలకు వచ్చి పడిందో ఆ రంధ్రం దానికి కనబడటం లేదు, రావటం లోపలకు వచ్చేసింది, బయటకు వెళ్ళటం దానికి తెలియటం లేదు. మనం అందరం ఇలాగే ఉన్నాము అని భగవాన్ చెప్పారు. నేను అనే తలంపు హృదయంలో నుండి బయటకు వచ్చి సహస్రారంలో ఆగిపోయింది. అక్కడ కొట్టుకొంటోంది కాని లోపలకు వెళ్ళటం దానికి తెలియటం లేదు. నువ్వు జపం చేసుకో, ధ్యానం చేసుకో. ఈ నేను అనే తలంపు హృదయంలో నుండి ఏ మార్గంలో ద్వారా అయితే వచ్చిందో తిరిగి అదే మార్గం గుండా దానిని హృదయంలోనికి పంపాలి. అది తిరిగి హృదయంలో ప్రవేశిస్తే అక్కడ ఉంటే అది నశిస్తుంది. ఈగ ఏ రంధ్రం గుండా దీపం బుడ్డిలోనికి వచ్చిందో ఆ రంధ్రం ద్వారా బయటకు వచ్చేసింది అనుకోండి, దానికి స్వేచ్ఛ వచ్చేస్తుంది. అలాగే నేను అనే తలంపు ఎక్కడ నుండి అయితే పుట్టి వచ్చిందో తిరిగి అక్కడకు చేరుకొంటే, హృదయంలోనికి చేరుకొంటే అది నశిస్తుంది. అప్పుడు నీకు స్వేచ్ఛ కలుగుతుంది. అప్పుడు శాంతే శాంతి, సుఖమే సుఖం, అప్పుడు ఇంక నీకు పునర్జన్మ లేదు.

గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీరు అతిగా పని చెయ్యవద్దు, పని నొల్లేసుకోవద్దు, మీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యండి. అలాగని అసలు పని చేయటం మానవద్దు. కొంతమంది అతిగా పని చేసి రాత్రి 12 గంటలకు, ఒంటి గంటకు వచ్చి అన్నం తింటారు, అయామ్ టైర్డ్ అంటారు. నువ్వు ఎవరిని ఉద్ధరించటానికి టైర్ అవుతున్నావు. లోకాన్ని ఉద్ధరించటానికి పనిచేస్తున్నావా? లేకపోతే నీ స్వార్థంకోసం పనిచేస్తున్నావా? నీ స్వార్థం కోసం అతిగా పని చేస్తూ ఆరోగ్యం పాడుచేసుకొంటావా? నీవు సమాజం కోసం పని చేయటం లేదు, నీ స్వార్థం కోసం అతిగా పని చేస్తున్నావు, అది మంచి పద్ధతి కాదు,

మధ్యేమార్గం అవలంభించండి.  మీరు ఎక్కువగా పనిచేస్తారు అనుకోండి, ఆరోగ్యం చెడిపోతుంది, తెలివి తేటలు తగ్గిపోతాయి, జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.  దురాశ వలనే మీరు అలా పనిచేస్తున్నారు, అది మీకు తెలియటం లేదు.  మీరు ఎంతవరకు పని చెయ్యాలో అంతవరకు పనిచేస్తూ తరువాత భగవంతుని పూజించండి, ఆయనను స్మరించుకోండి ఆయనను ధ్యానించండి.  భగవంతుడి యందు భక్తి కలిగే వరకూ, ఆయన పాదాలయందు ప్రీతి కలిగేవరకూ ఈ లోకానికి సంబంధించిన ఆకర్షణలలో నుండి బయటకు రాలేరు. ఉపనిషత్‌లలో చెప్పినట్లు గీతలో కేవలం జ్ఞానం గురించి చెప్పలేదు.  మన జీవన యాత్రకు సరిపడ విషయాలను అన్ని కోణాల నుండి చెప్పాడు.  మనం ఎలా జీవించాలి, స్నేహాలు ఎలా ఉండాలి, మనం పని ఎలా చెయ్యాలి, మనం అనుభవించే కష్ట సుఖాల గురించి అన్నింటి గురించి మామూలు మాటలతో చెపుతూ మధ్యమధ్యలో గమ్యాన్ని చూపిస్తూ వచ్చాడు. భగవద్గీత గొప్పతనం అది.  భగవద్గీత సమన్వయగ్రంథం.  ఇటు జ్ఞానానికి, అటు భక్తికి, కర్మకు అన్నింటిని సమన్వయం చేసాడు.  గ్రౌండ్ రియాలిటీస్‌ను, ప్రాక్టికాలిటీని ఎక్కడ విడిచిపెట్టలేదు.  నేను ఏదో చదువు కొన్నాను, జ్ఞానం సంపాదించాను అంటే అది కర్మ రంగంలో, నువ్వు చేసే పనిలో నీ యొక్క జ్ఞానం, నీ హృదయంలో ఉన్న వైభవం కర్మ ద్వారా వ్యక్తమవ్వాలి.  ఇక్కడ కృష్ణుడు నీచేత ప్రాక్టికల్‌గా చేయిస్తున్నాడు.  ప్రాక్టికల్‌గా నీవు చేయగలిగితేనే నువ్వు నేర్చుకొన్న థీరీ కరెక్టు.  నీకు థీరీ వచ్చింది అనుకో, ప్రాక్టికల్‌లో ఫెయిల్ అవుతున్నావు అనుకో, దాని వలన ప్రయోజనం లేదు.

ఉపనిషత్తులు చదివేసి, నాకు జ్ఞానం వచ్చేసింది అంటే జ్ఞానం, ప్రేమ నీ పనిలో కనబడాలి కదా.  భగవంతుడి దయ వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని నీవు ఏదో ఊహించుకోవటం వలన నీకు జ్ఞానం రాదు.  నేను సన్యాసిని, నేను గృహస్థుడను, నేను తెల్లబట్టలు కట్టుకొన్నాను ఇది వదిలేయండి.  ఏ నేను అయితే ఇలా శరీరంతోటి, మతంతోటి, ప్రాంతాలతోటి తాదాత్మ్యం పొందుతోందో దానిని వదిలించుకోవటానికి ప్రయత్నం చేయండి, అదే సన్యాసం.  మనం కానిదానిని విడిచిపెట్టటమే సన్యాసం.  భగవంతుడు మాయ ఎక్కడ పెట్టాడు అంటే దూడను కట్రాడుకు కట్టి కొడుతున్నట్లు మనం దేహం కాకపోయినా మనకు దేహబుద్ధిని పెట్టి దాని చుట్టూ తిప్పతున్నాడు.  దూడ తాడును తెంపేసుకొంది అనుకో ఇంక దెబ్బకు దొరకదు.  అలాగే మనం దేహాభిమానం నుండి విడుదల పొందాము అనుకో ఇంక కర్మ అనుభవించేవాడు అక్కడ ఉండడు.  ఒకవేళ దేహం ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికి వాడికి ఏమీ అనిపించదు.  ఎవడైతే దేహాభిమానం నుండి బయటకు వచ్చాడో వాడికి పుణ్యం లేదు, పాపం లేదు, వాడు ఈ ద్వంద్వాలకు అతీతుడు అయిపోతాడు.  వాడు అన్నింటిలో

నుండి బయటకు వచ్చేస్తాడు. తూర్పుగోదావరి జిల్లా నుండి వచ్చిన అబ్బాయికి అరటిపళ్ళ వ్యాపారం, ఫైనాన్స్ కంపెనీ ఉంది. అతనిని అరుణాచలం వెళ్ళు అని చెప్పాము అనుకోండి అక్కడికి వెళ్ళినా వ్యాపారం పెట్టేస్తాడు. లోపల వ్యాపారం చేసే బుద్ధి ఉంది కదా, ఆ బుద్ధి ఎక్కడికి పోతుంది. ఆ శరీరం అక్కడ ఉన్నా వాసన ఎక్కడికి పోతుంది. నీ వాసన యొక్క వేగం ముందు ఈ నిగ్రహం ఏమి పనిచేస్తుంది. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటి అంటే ఆ వాసన నశించాలి. వ్యాపారం చేసుకొనేవాడు ఎక్కడికి వెళ్ళినా వ్యాపారం చేసేస్తూ ఉంటాడు, ఆ బుద్ధి నశించాలి. ఇంక మనకు లోకం గొడవలు మనకు వద్దు, కాశీలో చనిపోదాము అనుకొని ఎవడైనా కాశీ వెళ్ళాడు అనుకోండి. వాడికి వ్యాపారం చేసే అలవాటు ఉంది అనుకోండి. అక్కడ ఎవడైనా కలిసి కాశీలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుంది అని చెపితే, కాశీ విశ్వనాథుడి గొడవ ఇంక వాడికి ఉండదు, రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టేస్తాడు. ఆ వాసన యొక్క వేగం ముందు కాశీ ఎందుకు వచ్చామో ఆ పని మర్చిపోతాడు. అందుచేత నీలోపల ఉన్న కోరికలను, వాసనలు, నీకు ఉన్న మమకారాన్ని విడిచిపెట్టటం సన్యాసం. రియల్ ఎస్టేట్ వ్యాపారం అలవాటు ఉంది అనుకో, దాని తాలుక వాసనను విడిచిపెట్టటం సన్యాసం. అంతేగాని కాశీ పారిపోవటం సన్యాసం కాదు. ఇక్కడ భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీవు ఇంట్లో ఉన్నా, అరుణాచలం వెళ్ళినా, కాశీ వెళ్ళినా నీ మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. ఒకవేళ నీ శరీరం చనిపోయినా అప్పుడు కూడా నీ మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా నువ్వు పరిష్కరించుకోవలసింది నీ మనస్సుని. నీ మనస్సును నువ్వు శత్రువుగా చేసుకోవద్దు, నీ మనస్సును మిత్రుడిగా మార్చుకో అంటున్నారు భగవాన్. మనం జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది, అదే అహంకారం. ఆ మొదటి తలంపుకు ఇతర తలంపులు వస్తాయి. ఆ మొదటి తలంపు, దానికి వచ్చే ఇతర తలంపులు కలిసి మనస్సు అవుతుంది.

మేము పనిచేస్తున్నాము, మేము పనిచేస్తున్నాము అంటారు. మీ దేహయాత్రకు సరిపడ పని చేసుకోవాలి, అది రైటే. నువ్వు చేసే పని జ్ఞానసముపార్జనకు సహకరించాలి, అది పని అంటే. హృదయంలో ఉన్న వస్తువు ఎరుకలోనికి రావటానికి దైనందిన జీవితంలో నీ యాక్టివిటీ ఎంతవరకు సహకరిస్తోంది అనేది చూసుకోవాలి. నువ్వు ఏదో పరిసరాలను విడిచిపెట్టి, ఇల్లు విడిచిపెట్టి, పని విడిచి పెట్టి పారిపోవటం కాదు. భగవంతుడు నీ దేహానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని శ్రద్ధగా చేసుకో, నీ మనస్సు అక్కడ పెట్టి చెయ్యి, అది ధ్యానంతో సమానము. అంతా పరమేశ్వరుడే. చేసేది అంతా ఆయనే. అది నీకు అర్థమవుతూ ఉంటే నీకు శాంతి కలుగుతుంది. అప్పుడు నీద్వారా ఏదైనా మంచి జరిగింది

అనుకో, అది నేను చేసాను అని నీకు అనిపించదు, ఈశ్వరుడి ప్రేరణ వలన అలా జరిగింది అని నీకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. నేను అనే తలంపుకు పుట్టిల్లు హృదయం, అత్తవారిల్లు శిరస్సు. ఈ పెళ్ళికూతురు పుట్టింటి నుండి అత్తవారింటికి, అత్తవారింటి నుండి పుట్టింటికి తిరుగుతూ ఉంటుంది. హృదయం శాంతి స్థానం, శిరస్సు అశాంతి స్థానము. హృదయంలో నుండి శిరస్సులోనికి ఒక నాడి ఉంటుంది, అది సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటుంది. దానిని అమృతనాడి అంటారు. గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి వచ్చినప్పుడు ఈ నేను అనే తలంపు ఆ నాడి ద్వారా హృదయంలో నుండి శిరస్సులోనికి వస్తుంది. నిద్ర వచ్చినప్పుడు ఆ నాడి ద్వారా పుట్టింటికి వెళ్ళిపోతుంది, ఇది మనకు తెలియకుండా జరిగిపోతుంది. సాధన అంటే ఏమిటి అంటే జాగ్రదవస్థలో నీ మనస్సును ఏకాగ్రపరచి, పవిత్రం చేసుకొంటే, హృదయం ఎంత పరిశుద్ధంగా ఉందో నీ మనస్సు అంత పరిశుద్ధం అయితే నిద్రపోయేముందు అది హృదయం లోనికి ఎలా వెళుతోందో అలాగ జాగ్రదవస్థలో అమృతనాడి ద్వారా అది హృదయంలోనికి వెళ్ళిపోతుంది, అప్పుడు నీకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది.

కొంతమందికి బోడి మెడ ఉంటుంది, మెడలో పెట్టుకోవటానికి ఏమీ ఉండవు. మెడలో బంగారం పెట్టుకొంటే కొంచెం అందంగా కనబడతాము. మనం సమాజంలో గౌరవం సంపాదించుకొన్నాము అనుకోండి, బోడి మెడకు బంగారం గొలుసు పెట్టుకున్నట్లుగా ఉంటుంది, దేహము నేను అనే తలంపుకు గౌరవం అనే గొలుసు తగిలించు కొన్నాము. నిన్న మా ఇంటికి ఒక బ్రాహ్మణుల అబ్బాయి వచ్చాడు, చాలా అందమైన మాట ఒకటి చెప్పాడు. కొంతమందికి గర్వం ఉంటుంది. ఆ గర్వం లోపల దాచేసుకొంటారు. మాట్లాడేటప్పుడు, చూసేటప్పుడు గర్వం మనకు కనబడకుండా వ్యవహరించుకొంటారు కాని లోపల అంతా గర్వం ఉంటుంది. అతను ఏమి చెప్పాడు అంటే గర్వం మనకు కనబడకుండా దాచేసుకొంటున్నారు, దేవుడికి కనబడకుండా ఆయన కళ్ళు ఎలా మూయగలరు అంటున్నాడు. గర్వం నాకు కనబడనివ్వరు కాని లోపల గర్వం ఉన్నట్లు దేవుడు చూస్తున్నాడు కదా. ఇటువంటి జిమ్మిక్కుల వలన దేవుడు మోసపోడు, ఇలా ప్రవర్తించి మనం దేవుడిని మోసం చేయలేము అని చెప్పటంకోసం చెపుతున్నాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-03-2007, గొల్లలమామిడాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉపనిషత్‌లలో రామ మంత్రాలు చాలా ఉన్నాయి. ఓం శ్రీం రాం రామాయ నమః ఇది ఒక రామమంత్రం, శ్రీరామః శరణం మమ ఇది ఒక రామమంత్రం. సమర్ధరామదాసు

గారు చెప్పిన మంత్రం ఏమిటి అంటే శ్రీరామ జయరామ జయజయ రామ. కేరళ దగ్గర రామదాసుగారి ఆశ్రమం ఉంది, ఆయన రామభక్తుడు. అక్కడ రామనామం ఎలా చేస్తారు అంటే శ్రీరామ జయరామ జయజయ రామ ఓం అంటే చివర ఓం కలుపుతారు. పరమాత్మ సన్నిధిలో భీష్ముడు ధర్మరాజుకు విష్ణుసహస్రనామాలు చెప్పాడు. అందులో శివనామం, రామనామం, కృష్ణనామం అన్నీ వస్తాయి. కొంతమంది చాలా నిష్టగా విష్ణుసహస్రనామాలను పారాయణ చేస్తారు. ధర్మ అర్థ కామ మోక్షములనే నాలుగు పురుషార్థములను విష్ణుసహస్ర నామాలు సాధించిపెడతాయి. పార్వతి అమ్మవారు పరమేశ్వరుడిని ఏమని అడిగింది అంటే విష్ణుసహస్రనామాలు అంటే వెయ్యి నామాలు అందరూ చేసుకోలేకపోవచ్చు, ఆ వెయ్యి నామాలు చేసిన ఫలితం ఏదైనా ఒక నామం చేసుకొంటే వచ్చే ఉపాయం ఉందా చెప్పమని అడిగింది. ఒకవేళ మీరు సహస్రనామాలు చేయలేకపోతే ఓం శ్రీరామ రామ రామ ఇలా రామనామం చేసుకొన్నా సహస్రనామాలు చేసినంత ఫలితం వస్తుంది అని పరమేశ్వరుడు చెప్పాడు. రామలో మూడు అక్షరాలు ఉన్నాయి. ర, ఆ కలిపి రా అయింది, తరువాత మ ఉంది. ఈ అక్షరాలు మనకు కాంతిని ఇస్తాయి, శాంతిని ఇస్తాయి, చివరి అక్షరం మ ఐశ్వర్యాన్ని ఇస్తుంది. రామనామం లక్ష్మీప్రదమైనది అని చెపుతారు. మీకు ఐశ్వర్యం కావాలంటే రామాయణం పారాయణ చెయ్యండి, జయం కలగాలి అంటే భారతం పారాయణ చేయండి, వైరాగ్యం కావాలంటే భాగవతం పారాయణం చెయ్యండి అని సాంప్రదాయంలో మన పెద్దలు చెపుతారు.

రాముడు ఏ ధర్మమార్గంలో ప్రయాణం చేసాడో అదే రామాయణం. మన ఆంధ్రులందరికీ రాముడు అంటే చాలా ఇష్టం. రామాయణం ఆదికావ్యం. అంతకు ముందు వేదాలు, ఉపనిషత్‌లు ఇవన్నీ మంత్రబద్ధమేకాని శ్లోకంగా ఏమీ లేదు. మొదట శ్లోక రూపం ధరించింది రామాయణమే. రామాయణం పారాయణ చేస్తే బుద్ధి వికశిస్తుంది, అంతేకాదు మనకు ఏ ప్రేరణ వస్తే మనం బాగుపడతామో ఆ ప్రేరణను రామచంద్రమూర్తి మనకు కలుగజేస్తాడు, అది రామాయణం యొక్క ప్రత్యేకత. మనం బాగుపడాలంటే మంచి తలంపులు, మంచి ఆలోచనలు రావాలి కదా అంటే లోపల నుండి మంచి ప్రేరణ రావాలి. మనకు లోపల నుండి మంచి ప్రేరణను కలుగజేసి, మన బుద్ధిని బాగుచేసి, మనకు ఆచరించే శక్తిని కలుగజేసేదే రామాయణం. మనలను రక్షించేది రామాయణం. మనం దారి తప్పకుండా చూసేవాడు రామచంద్రమూర్తి. మనం పాడైపోవటానికి కారణం ఏమిటంటే మనకు రియాక్టింగ్ మైండ్ ఎక్కువ. ఎవరైనా చిన్న మాట అంటే తట్టుకోలేము. మనకు సహనం లేదు, అర్థం చేసుకొనే శక్తి లేదు, సొంత ఆలోచన లేదు. వారు అలా ఉన్నారు,

మనం కూడా అలా వుందాము అని అనుకరణకు అలవాటుపడ్డాము. కొంతమంది ఏమనుకొంటున్నారు అంటే ఏదో యోగాభ్యాసాలు చేస్తే సరిపోతుంది, ప్రాణాయామం చేస్తే సరిపోతుంది, విచారణ చేస్తే సరిపోతుంది, ఏదో గంట జపం చేస్తే సరిపోతుంది అనుకొంటున్నారు. అలాకాదు. జపధ్యానములు చేసుకోండి, మంచిదే కాని ఇతరులతో మన వ్యవహారం ఎలా ఉంటోంది, నేను మీతో మాట్లాడుతున్నాను అనుకోండి అహంకారం కోసం మాట్లాడుతున్నానా లేక మీరు బాగుపడాలని మాట్లాడుతున్నానా అనేది మనం జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. మనకు రియాక్టింగ్ మైండ్ ఎంతకాలం అయితే ఉందో అంతకాలం మనస్సుకు లోచూపు రాదు. భారతదేశంలో రామనామానికి ఉన్న ప్రఖ్యాతి ఏ నామంకు లేదు. హరే రామ హరే రామ రామరామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే. మనలో అంతర్యామిగా ఉన్న శ్రీహరే రాముడిగా వచ్చాడు, కృష్ణుడిగా వచ్చాడు, మనలను గైడ్ చేయటం కోసం వేషాలు మార్చుకొని వచ్చాడు కాని వచ్చినవాడు శ్రీహరే అని చెప్పటం. నామసంకీర్తన చేసుకోవటం వలన కలియుగంలో తరిస్తారు. మన బుద్ధిలో ఉన్న దోషాలను రామనామం పిండేస్తుంది. రాముడు గురించి ఏమని చెపుతారు అంటే మన ఋషులు, యోగులు, మహాత్ములు ఎక్కడ నుండి అయితే ఆనందాన్ని పొందుతున్నారో, ఏ స్థానంలో అయితే రమిస్తున్నారో ఆస్థానమే రామచంద్రమూర్తి. తులసీదాసు, కబీరుదాసు ఇద్దరు రామ భక్తులు. తులసీదాసు ఎంతో భక్తితో రామాయణం వ్రాసారు. రామ అంటే రెండు అక్షరాలు, మీరు రెండు అక్షరాలు అక్కరలేదు రాం అని పలకండి చాలు మీరు తరిస్తారు అని తులసీదాసు చెప్పారు. దశరథరాముడే నా దేవుడు అని తులసీదాసు అనేవారు. నా దేవుడు ఆత్మారాముడు అని కబీరుదాసు అనేవారు. తులసీదాసు గారు గుణాలతో కూడిన రాముడిని ఆరాధించేవారు, నిర్గుణుడు, నిరాకారుడు అయిన దేవుడిని కబీరుదాసు ఆరాధించేవారు.

వైష్ణవ సాంప్రదాయంలో రామాయణానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. రామానుజుడు వాళ్ళు చెప్పినది ఏమిటి అంటే ఏ పరమాత్మను తెలుసుకోమని వేదాలు చెప్పినాయో ఆ పరమాత్మే రామచంద్రమూర్తి రూపంలో వచ్చాడు, నాలుగు వేదాల సారమే రామాయణం అని చెపుతారు. రామాయణంలో ఎక్కువ ప్రాక్టికాలిటీ ఉంది, మనిషి ఎక్కడ ఎలా ప్రవర్తించాలి అనేది రాముడు చేసి చూపించాడు. మనం ఇతరులతో ఎలా మాట్లాడుతున్నాము, ఇతరులతో వ్యవహారం ఎలా ఉంటోంది అని జాగ్రత్తగా చూసుకోండి. ఇతరులతో మనకు ఉన్న అనుబంధం అహంకారపూరితంగా ఉంటే ఎన్ని యోగాభ్యాసాలు మీరు చేసినా అహంకారం నశించదు. మనం ఇతరులను మోసం చేయటం లేదు అనుకొంటే సరిపోదు, ఇతరులు చేసే మోసంలో కూడా మనం పడకూడదు. రాముడిని

మర్యాద పురుషోత్తముడు అంటారు. రామరావణ యుద్ధం జరుగుతున్నప్పుడు ఒకరోజున రామణాసురుడి చేతిలో యుద్ధం చేయటానికి ఆయుధాలు లేవు. అప్పుడు రామచంద్రమూర్తి ఏమని చెప్పాడు అంటే రావణా నీవు ఇంటికి వెళ్ళిపో. స్నానం చేసి, భోజనం చేసి, విశ్రాంతి తీసుకొని రేపు కొత్త గుర్రాలు, ఆయుధాలతో యుద్ధానికి రా అని చెప్పాడు. శత్రువుతో అలా ఎవడు చెపుతాడు. వాడు రాముడు. రాముడికి రియాక్టింగ్ మైండ్ లేదు, మనకు రియాక్టింగ్ మైండ్ ఎక్కువ. మన జీవితంలో సమన్వయం లేదు. పూజగదిలో కొద్ది టైము భక్తిగా ఉండి, ప్రపంచంలో ఎలా ఉన్నా పరవాలేదు అనుకొంటున్నాము. అందువలన సాధన చేసినా జ్ఞానం రావటం లేదు. ప్రతీ చిన్న విషయానికి రియాక్టు అయిపోతున్నాము. మనిషి కూడా నీడ ఎలా ఉంటుందో అలాగ రాముడి కూడా లక్ష్మణుడు ఉంటాడు. అది సోదర ప్రేమ. ఇప్పుడు అంత ప్రేమ ఉండనక్కరలేదు, కనీసం గోతులు తీయకుండా ఉంటే సరిపోతుంది. నేను కూడా అరణ్యవాసానికి వస్తానని రాముడితో సీత చెప్పింది. అరణ్యవాసం చెయ్యటం చాలా కష్టం, నన్ను అరణ్యవాసానికి వెళ్ళమన్నారు కాని నిన్ను వెళ్ళమనలేదు అందుచేత నీవు రావద్దు అని రాముడు సీతతో చెపుతాడు. అప్పుడు సీత ఏమంది అంటే నువ్వు పురుషుడి వలె కనిపిస్తున్న స్త్రీవి అంది. సీతమ్మ ఆ మాట అన్నప్పుడు కూడా రాముడు చాలా ప్రశాంతంగా ఉన్నాడు. ఎప్పుడూ ఆయన రియాక్టు అవ్వలేదు. చాకలివాడి మాటలను విని రాముడు సీతమ్మను అడవికి పంపాడు అని చెపుతారు. చాకలివాడి మాటలను వినేటంత అమాయకుడు కాదు రాముడు. సీతమ్మను ఎక్కడకు పంపాడు? వాల్మీకి ఆశ్రమానికి పంపాడు. మహర్షుల దగ్గర ఆధ్యాత్మికంగా ట్రైనింగ్ పొందవలసిన అవసరం ఉంది అందుచేత సీతమ్మను మహర్షుల ఆశ్రమానికి పంపాడు. అక్కడ చాకలివాడి మాటలు నిజం కాదు, అవి వంపు మాత్రమే. ఆదర్శపురుషుడు రాముడు, ఆదర్శసోదరుడు రాముడు, ఆదర్శభర్త రాముడు, ఆదర్శబిడ్డ రాముడు.

గాంధీగారికి చిన్నప్పుడు చాలా భయంగా ఉండేది. చిన్నప్పుడు అంత భయంగా ఉండే నీవు ఇప్పుడు ఇంత ధైర్యవంతుడివి ఎలా అయ్యావు అని అడిగితే దానికి కారణం రామనామం అని చెప్పారు. మా ఇంట్లో ఉన్న పనిమనిషితో నాకు భయం ఎక్కువగా ఉంది అని చెపితే ఆవిడ నాకు రామనామం ఉపదేశించింది. మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధీ మహాత్ముడు అయ్యాడు అంటే రామ అనే రెండు అక్షరాలే కారణం. మామూలుగా ఏదో కాఫీ తాగి, ఫ్యాన్ కింద కూర్చొని, ఎసి గదిలో కూర్చొని రామనామం అనటం కాదు, గాంధీగారిని చంపినప్పుడు కూడా ఆయన హే రామ్, హే రామ్, హే రామ్ అంటూ ప్రాణం విడిచిపెట్టారు. అంటే ప్రాణ ప్రయాణసమయంలో కూడా రాముడిని స్మరించుకొంటూ

బయటకు వెళ్ళారు. గాలి లేకుండా బతకగలనేమోగాని రామనామం లేకుండా బతకలేను అని బాపూజీ అంటూ ఉండేవారు. అరణ్యవాసంలో మొదటి రోజున రాముడు నేలమీద పడుకొన్నాడు అని వ్రాస్తే ఆ ఘట్టం దగ్గరకు వచ్చేటప్పటికి వైష్ణవులు విలపిస్తారు. రామాయణంలో వాల్మీకి రాస్తే రాసాడులెండి, పెరుమాళ్ళు భూమి మీద పడుకోవటం అది మేము వినలేకపోతున్నాము. ఆ నాలుగు శ్లోకాలు వదిలేసి మిగతాది చదవండి అనేవారు. అంటే భక్తిని అంతదూరం తీసుకొనిపోయారు. నువ్వు ఎన్ని యోగాభ్యాసాలు చేసినా ధర్మాన్ని ఆచరించకుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు. ధర్మాన్ని ఆచరించకుండా, ఇతరులపట్ల మనం ఎలా ఉంటున్నాము, సమాజంపట్ల ఎలా ఉంటున్నాము, కుటుంబంలో ఎలా ఉంటున్నాము, భగవంతుడి పట్ల మన ప్రవర్తన ఎలా ఉంది అని చూసుకోకుండా మేము ఏదో ముక్కులో గాలి చూసుకొంటున్నాము మాకు ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది అంటే భగవంతుడు అంత అమాయకుడు కాదు. మీ బిహేవియర్ ఇంపెర్సనల్‌గా ఉందా, నువ్వు గొప్పలకోసం పనులు చేస్తున్నావా, ఇతరుల క్షేమం కోసం చేస్తున్నావా అనేది భగవంతుడు చూస్తాడు, దానినిబట్టి నీ ఆధ్యాత్మిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. విభీషణుడు రామచంద్రమూర్తిని శరణువేడతాడు. రాముడి దగ్గర ఉన్నవారంతా కూడా మీరు విభీషణుడిని చేరనివ్వవద్దు వాడు మంచివాడు అయినా కూడా రాక్షసకుటుంబంలో నుండి వచ్చాడు, ఆ కుటుంబ లక్షణాలు వాడికి ఉంటాయి అని రాముడితో చెపుతారు. అప్పుడు రామచంద్రమూర్తి ఏమన్నాడు అంటే వాడు నాపాదాలను ఆశ్రయిస్తున్నాడు, నన్ను శరణువేడుకొంటున్నాడు, వాడి మనస్సును నాకు ఇస్తున్నాడు అందుచేత వాడిని రక్షించే తీరతాను అని చెప్పాడు, వాడు రాముడు. ఏమి అక్కరలేదు మీ మనస్సును మీ గురువుకు యిచ్చేసారు అనుకోండి, మీ మనస్సును మీ ఇష్ట దేవతకు ఇచ్చేసారు అనుకోండి. ఇక్కడ కూర్చొన్నవారు కూర్చొన్నపళంగా జ్ఞానులు అయిపోతారు. పెంట అంతా మనస్సులోనే ఉంది. గురుభక్తి లేకుండా, దైవభక్తి లేకుండా, ధర్మఆచరణ లేకుండా ఈ సృష్టిలో ఇంతవరకు ఏమతంలోను ఎవడికి కూడా ఆత్మజ్ఞానం కలుగలేదు.

వేదాలసారం రామాయణం అని, వేదాలలో ప్రతిపాదించిన పరమాత్మే శ్రీరాముడు అని చెపుతారు. పూర్వం ఎవరో ఒక రెడ్డిగారు ఇక్కడ రామాలయం కట్టించారు, వారి మనవలు ఇప్పుడు ఈ రామాలయాన్ని చూస్తున్నారు. ఇక్కడ దేవుడికి ఎంత బంగారం ఉంది, గుడి ఎంత పెద్దది అనేది కాదు, ఈ గుడిలోనికి రావటం వలన ఎంతమంది మనస్సులు బాగుపడుతున్నాయి అనేది ప్రధానం. మీ ఇంట్లో వారికి మీరు డబ్బు సంపాదించి ఇవ్వగలరు కాని వారి మనస్సును మీరు బాగుచేయలేరు. మనస్సును బాగుచేసుకోవటం కంటే ముఖ్యమైన పని ఈ సృష్టిలో అసలు ఏదీ లేదు. ఎందుచేతనంటే మన శరీరం చనిపోయిన

తరువాత మన కూడా వచ్చేది మన మనస్సే. మన శరీరం చనిపోయిన తరువాత అసలు మన కూడా ఏదైతే వస్తుందో దానిని మనం పట్టించుకోవటం లేదు. మన మనస్సును సంస్కరించుకోవాలని, మనస్సును పవిత్రం చేసుకోవాలని ఆ బుద్ధి మనకు రావటం లేదు, ఆ బుద్ధిని తీసుకొని వచ్చేదే రామాయణం. ఇల్లు కట్టుకొన్నాక తాపీమేస్త్రికి, వడ్రంగి మేస్త్రికి బట్టలు ఇస్తారు అలాగే పట్టాభిషేకం అయ్యాక రామచంద్రమూర్తి అందరికి ప్రెజంటేషన్స్ ఇస్తాడు. చివరకు ఆంజనేయస్వామి మిగిలిపోయాడు, ఆంజనేయస్వామికి ఏమి ఇవ్వాలో ఆయనకు అర్థమవ్వలేదు. సృష్టిలో రాముడు తప్ప ఆయనకు ఏ పదార్థం అక్కరలేదు, ఏమిఇచ్చి ఆంజనేయస్వామిని తృప్తిపరుస్తాడు. రామచంద్రమూర్తి వెళ్ళి ఆంజనేయస్వామిని కౌగిలించుకొన్నాడు. వాడు హనుమాన్. మీరు ఆంజనేయస్వామిని ఆరాధించటం వలన మిమ్మల్ని పట్టి పీడించే గ్రహాలు పారిపోతాయి, అట్టివాడు హనుమాన్. మనం అందరం ఎటువంటి వారం అంటే ఇవాళ చేను ఊడ్చి రేపు పంట వచ్చేయాలి అనుకొంటున్నాము. గుడికి వెళ్ళి కోరికలు కోరుకోవటం, గుడి దాటకుండా నెరివేరిపోవాలని అనుకోవటం, అరుణాచలం వెళ్ళి గిరిచుట్టూ తిరిగేటప్పటికి మనకు మోక్షం వచ్చేయాలి అనుకోవటం, మనం ఇలా తయారయ్యాము, మనకు భక్తి లేదు, ఉపాసన లేదు, ఏకాగ్రత లేదు, ప్రవీణత లేదు, జీవితంలో మాధుర్యం లేదు. రామనామం మీరు శ్రద్ధగా చేస్తూ ఉంటే ప్రాణాయామం కంటే, యోగాభ్యాసాల కంటే ఎక్కువ ఆధ్యాత్మిక పురోగతి పొందుతారు. రామనామం మనస్సును పరిశుద్ధం చేస్తుంది, రామనామం మనస్సుకు ఏకాగ్రత తీసుకొని వస్తుంది. మనకు అవసరం లేని తలంపులు వస్తూ ఉంటే రామనామం వాటిని అరికడుతుంది. రామనామం చాలా స్వీట్‌గా ఉంటుంది. రామ గురించి భగవాన్ ఒకమాట చెప్పారు. రా అన్నప్పడు నోరు తెరుచుకుంటుంది, మ అన్నప్పడు నోరు మూసుకొంటుంది. రా అన్నప్పడు మన బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే అవి బయటకు పోతాయి. బయటకు పోయిన దోషాలు తిరిగి లోపలకు రాకుండా మ అన్నప్పడు నోరు మూసుకొంటుంది అని భగవాన్ రామశబ్ధం గురించి చెప్పారు.

మనం పెద్దవారితోటి, దేవతాపురుషులతోటి మాట్లాడేటప్పడు వారి మొఖం మీద మొఖం పెట్టి మాట్లాడకూడదు, ఒక ప్రక్కకు ఒరిగి మాట్లాడాలి, మనం రాముడి దర్శనానికి వెళ్ళామనుకోండి, ఒక ప్రక్కగా నుంచొని చూడాలి కాని ఎదురుగా నుంచొని చూడకూడదు, అది మర్యాద ధర్మం కాదు. రామానుజుడు పెరుమాళ్ళను సేవించటానికి గుడికివెళితే ఏమనుకొనేవాడు అంటే నిన్ను చూడటానికి చాలామంది భక్తులు వస్తున్నారు, రామా నీకు దిష్టి తగలకూడదు, నువ్వు సుఖంగా ఉండాలి అనుకొనేవాడు. మనం గుడికి వెళితే ఆయన

గొడవ మనకు అక్కరలేదు, మన కోరికల లిష్టులు చదివేస్తాము. వైష్ణవ సాంప్రదాయంలో వారి ఉద్దేశ్యం ఏమిటి అంటే మాకు ఏది మంచిదో పెరుమాళ్లకు తెలుసు, అది ఎప్పుడు ఇవ్వాలో ఆయనకు తెలుసు, ఆయనే నిర్ణయించుకొంటాడు మాకు ఏమీ సంబంధం లేదు. నీ పాదాలను ఆశ్రయించాము, అంతవరకే మాకు తెలుసు అంటారు. మోక్షం గురించి కూడా వారు అడగరు, అలా అడిగితే వారి శరణాగతికి భంగం అనుకొంటారు. మద్వాచార్య సాంప్రదాయంలో భక్తికి ఇచ్చే ప్రాధాన్యం, ఉపాసనకు ఇచ్చే ప్రాధాన్యం మోక్షానికి ఇవ్వరు. కాని మనం సాధన చెయ్యము, మనకు ఉపాసన లేదు, మనకు శరణాగతి లేదు, మోక్షం గురించి ఆలోచిస్తూ ఉంటాము. ది పారడైజ్‌లాస్ట్‌లో ఒకచోట ఏమని చెప్పాడు అంటే మనుషులు ఎటువంటివారో కనిపెట్టాలంటే పెద్ద కష్టపడ నక్కరలేదు, వారి మొఖాల వంక చూడండి. మీ ఇంట్లోవారు అయినా, బయటవారు అయినా సరే వారితో మాట్లాడుతూ వారి మొఖం వంక చూస్తూ ఉండండి. మనం ఇతరులను విమర్శిస్తూ మాట్లాడుతున్నాము అనుకోండి, వారికి సంతోషం వచ్చింది అనుకోండి, దానిని బట్టి వారి పాడుబుద్ధి ఏమిటో మనకు తెలుస్తుంది, అప్పుడు వారిని వదిలేయాలా, స్వీకరించాలా అనేది చూసుకోండి అని చెప్పాడు.

మనకు దేహబుద్ధి ఉన్నంతకాలం ఆత్మ బుద్ధి కలుగదు. దేహము నేను అనే తలంపే మొదటి పాపం. ఆ పాపంలో నుండి ఎవడైతే విడుదలపొందడో వాడికి లోపల ఉన్న వస్తువు గోచరం కాదు. నీకు దేహబుద్ధి ఉన్నంత కాలం బయట దేహం ధరించి ఉన్న గురువునో, దేవతాపురుషుడునో ఆశ్రయిస్తావు. మనలో ఉన్న అజ్ఞానం పోవటానికి గురువును ఆశ్రయించాలి అని శాస్త్రం చెపుతోంది. గురువును ఆశ్రయిస్తే ఆయన నీకు ఆత్మజ్ఞానం గురించి బోధిస్తాడు. ఒకసారి భగవాన్ దగ్గర ఎవరో కూర్చొన్నారు. నేను పెద్దవాడిని అని ఆయన లోపల అనుకొంటున్నాడు. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు పెద్దవాడిని అని అనుకొంటున్నావు అని ఆయనతో అనలేదు. బహుచిన్నవారు, వారికి తాడు బొంగరం లేకపోయినా, వారు సమాజానికి ఎందుకు పనికిరాకపోయినా కూడా మేము పెద్దవారము, మేము గ్రేట్‌మేన్ అనుకొంటూఉంటారు. సమాజానికి ఏమీ ఉపయోగపడకుండా సమాజం వారిని గౌరవించాలి అని చూస్తారు, నిజంగా పెద్దవాడు ఎవడూ నేను పెద్దవాడిని అని అనుకోడు అని భగవాన్ చెప్పారు. అదేమిటండీ నేను అలా అనుకొంటున్నానా అని ఆయన అడిగాడు. నువ్వు అలా అనుకొంటున్నావో, లేదో నీకు తెలియదా అన్నారు భగవాన్. నీ మనస్సులో ఏమనుకొంటున్నావో నీకు తెలియదా, నేను చెప్పాలా అన్నారు భగవాన్.

రామనామం మనం యాంత్రికంగా చేయకూడదు, ప్రీతిగా ప్రేమగా చేయాలి, మనస్సు

అక్కడ ఉండాలి. గురువు అంటే బోధస్వరూపుడు. మిమ్మల్ని బాధపెట్టేవాడు గురువు కాదు, మీకు సత్యం గురించి బోధించేవాడు గురువు. గురువు బోధించగా బోధించగా నీకు లోచూపు కలుగుతుంది, ఆత్మారాముడి వైపుకు మీ మనస్సు తిరుగుతుంది. గురువు చెప్పింది శ్రవణం చేయగా, శ్రవణం చేయగా ఏదో ఒక పెద్ద కెరటం వచ్చి మిమ్మల్ని హృదయంలోనికి గెంటేస్తుంది. మీకు లోచూపు కలిగినప్పడు లోపలఉన్న వస్తువు యొక్క వైభవం, దాని యొక్క రుచి మీకు తెలుస్తుంది. ఒకసారి ఆ రుచి మీకు తెలిసాక ఇంక మీరు దానిని విడిచిపెట్టరు. పుస్తకాలు చదివి పాండిత్యం సంపాదించినవారు గురువులుకాదు, హృదయంలో అంతర్యామిగా ఉన్న వస్తువు తాలుక అనుభవాన్ని ఎవడైతే పొందాడో వాడే గురువు. ప్రతీ విషయానికి ఆసక్తి పెట్టుకొంటే తొందరగా బిపి వచ్చేస్తుంది, ఆరోగ్యం చెడిపోతుంది. ఆసక్తిరహితుడు, మమకారరహితుడు, అహంకారరహితుడు మాత్రమే బ్రహ్మాకారం పొందుతాడు. బ్రహ్మాకారం పొందినవాడు మాత్రమే ఈ సృష్టిలో నిజమైన సుఖి. నాకు ఇష్టమైన పనులు చేస్తూ ఉండు, నా మాటలను ఎంజాయ్ చెయ్యి, ఎల్లయ్య గొడవ, పుల్లయ్య గొడవ వద్దు, వారి రూపాలను, గుణాలను ప్రక్కకు పెట్టి అందరిలోను ఉన్న నన్ను సంతోషపరచటానికి పనిచెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు.

మీ ఇంటి దగ్గర ఆవు ఈనింది అనుకోండి. మీ అమ్మాయి మద్రాసులో ఉంది అనుకోండి. మీ అమ్మాయికి జున్ను ఇష్టం అనుకోండి. అయ్యో ఆవు ఈనింది, అమ్మాయి ఇంటి దగ్గర ఉంటే జున్ను తినును కదా, అమ్మాయి ఇక్కడ లేదు, అమ్మాయికి జున్ను ఇష్టం అని ఇలా ఏదో అనుకొంటారు కదా. మీ అమ్మాయిపట్ల మీరు ఎంత ఆప్యాయత, ప్రేమ చూపిస్తున్నారో అలాగే జీవకోటిలో ఉన్న నా పట్ల కూడా అంత ప్రేమగా, ఆప్యాయతగా ఉండండి అని పరమాత్మ చెపుతున్నాడు. నేను వద్దని చెప్పిన పని మానెయ్యి, చెయ్యమని చెప్పింది శ్రద్ధగా చెయ్యి. చెయ్యకూడని పనులు చేస్తే మీకు దుఃఖం వస్తుంది. చెయ్యవలసిన పని శ్రద్ధగా చేస్తే సంతోషం వస్తుంది అంటున్నాడు. నీ మనస్సును నాకు ఇచ్చేసి నీ పనులు నీవు చేసుకో. నీ మనస్సును నాకు ఇచ్చేస్తే బాగుచేసి పెడతాను అంటున్నాడు పరమాత్మ. బాగుచేసి ఇవ్వటం అంటే జ్ఞానం ఇచ్చేస్తాడు. మా అమ్మాయికి బాగాలేదు, ఏమీ శాంతిగా లేదు అంటే మీ అమ్మాయికి శాంతి ఇవ్వటానికి నువ్వు ఎవడవు? మీ అమ్మాయికి డబ్బులు ఇవ్వగలవు, బట్టలు ఇవ్వగలవు కాని శాంతిని ఇవ్వటం అనేది గురువుకే సాధ్యం. గురువు శాంతిదాత, కాంతిదాత, మోక్షదాత, అది ఆయనకే సాధ్యం. మీరు సంవత్సరాల తరబడి యోగాభ్యాసాలు చేసి, ఇతరుల పట్ల అహంకారపూరితంగా కనుక వ్యవహరిస్తూ ఉంటే ఎన్ని సంవత్సరాలు మీరు యోగాభ్యాసం చేసినా మీకు మోక్షం కలుగదు, కలుగదు, కలుగదు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 31-03-2007, ముమ్మిడివరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం వినే విషయాలు ఏవీ నిజంకాదు, కళ్ళతో చూసే విషయాలు ఏవీ నిజంకాదు, ఇవన్నీ పారమార్థికసత్యంకాదు. వేదాంతపరిభాషలో ఏమని చెపుతారు అంటే మీరు చెవులతోటి వినే విషయాలు, కళ్ళతో చూసే విషయాలు, మీకు ఉన్న కోరికలు ఇవన్నీ ఏదో రోజున మనం మరిచిపోకుండా మనకు ఆత్మజ్ఞానం రాదు. ప్రపంచంలో శాంతి తక్కువగా ఉంది, ప్రపంచంలో శాంతి కోసం ఎలా కృషి చేయాలి అని అడుగుతున్నారు. ప్రపంచం అంటే ఏమీ లేదు నీకు ఉన్న కోరికలు, నీకు ఉన్న వాసనలే ప్రపంచం. రకరకాల మనుషులు ఉంటారు. కొంతమంది పాండిత్యం కోసం కృషి చేస్తారు. కొంతమంది ధనంకోసం కృషి చేస్తారు. కొంతమంది అధికారం కోసం కృషి చేస్తారు. ఎవరి కోరికలు నెరవేర్చుకోవటానికి వారు కృషి చేస్తూ ఉంటారు, ఆ కోరికలు లేవు అనుకోండి అసలు ప్రపంచం కనబడదు. కోరిక లేనివాడికి వికారం లేదు, అన్ని వికారాలు కోరికలో నుండే వస్తాయి. ధాన్యం ఆడించినప్పుడు చిట్టు, తవుడు, బియ్యం ఎలా వస్తాయో అలాగే కోరికలోనుండే కోపం, లోభిత్వం అన్నీ వస్తాయి. మనం అవసరానికి మించి ఏదో ఒకటి పోగుచేసుకొంటూ ఉంటాము. మనం పోగుచేసుకొనే వస్తువులలో శాంతి ఉందని అనుకొంటాము. మనం పోగుజేసుకొన్న వస్తువులను విడిచిపెడితేగాని శాంతిరాదు అని మరల ఏదో జన్మలో మనకు తెలుస్తుంది. అప్పుడు వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నం చేస్తాము. ఇవన్నీ ఎవరిమీదో కోపంతోగాని, రాగద్వేషములతోగాని చెప్పిన మాటలు కాదు. ఋషులు వారి హృదయంలో దర్శించి చెప్పిన మాటలు. అసలు అడిగిన వాడికి శాంతి లేదు. నేను శాంతిగా ఉన్నాను అనుకోండి మీరందరు నాకు శాంతిగానే కనిపిస్తారు.

భగవాన్ ఏమని చెప్పారు అంటే నిన్ను నువ్వు చూసుకోకుండా లోకాన్ని చూస్తే నువ్వు సుఖపడవు, నిన్ను నువ్వు చూసుకొని లోకాన్ని చూస్తే సుఖపడతావు అని చెప్పారు. లోకం అంటే పెంట అందులో హెచ్చుతగ్గులు ఉంటాయి, భిన్నత్వం ఉంటుంది, మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు, రకరకాలుగా ఉంటారు. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే నీవు ఏదిగా ఉన్నావో అదే లోకంలో కనిపిస్తుంది. ఇంక లోకానికి సంబంధించిన ఆకర్షణలు నీకు ఉండవు. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే లోకానికి సంబంధించిన ఏదో ఆకర్షణకు గురి అవుతావు, అక్కడ నుండి నీ మనస్సు పతనం అవ్వటం ప్రారంభమవుతుంది. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీ ఇంట్లో నలుగురు మనుషులు ఉన్నారు, నలుగురికీ శాంతి లేదు, ప్రపంచానికి శాంతి ఎలాగ వస్తుంది. నేను సుఖంగా, శాంతిగా ఉంటే మీరు కూడా సుఖంగానే,

శాంతిగానే కనిపిస్తారు. నాలో శాంతి లేనప్పుడు మీకెవరికీ శాంతి లేదు అనుకొంటాను అంటే తనలో ఉన్నదే లోకంలో కనిపిస్తుంది. తను శాంతిని సంపాదిస్తే లోకంలో శాంతే కనిపిస్తుంది. ఈ సృష్టి అంతా మనస్సు చేత కల్పించబడినదే. మనస్సు ఉంటే లోకం ఉంది, మనస్సు లేకపోతే లోకం లేదు. గాఢనిద్రలో మనస్సు తన మూలంలో ఉన్నప్పుడు నీకు ప్రపంచం గోచరించటం లేదు. మెలుకువలో మనస్సు వచ్చాక నీకు ప్రపంచం వస్తోంది. యోగం అంటే కేవలం స్వార్థం లేకుండా పనిచేయటమే కాదు, ఎలా పని చేస్తే నీకు శాంతి కలుగుతుందో అలాగ పనిచేస్తే అది యోగం. జరిగిపోయిన విషయాలు తలలో మోయకూడదు, నువ్వు మరిచిపోతే ఏమీ లేదు. ఎదుటివారిని క్షమించటం కంటే మరిచిపోవటం కష్టం అని పెద్దలు చెపుతారు. నీలో భేదబుద్ధి ఉన్నంత కాలం ఎదుటివారు నాకు అపకారం చేసారు అనే విషయం మరిచిపోలేవు. ద్వైతం అంతా దేహభావనలో నుండి కల్పించబడింది. దేహభావన నశిస్తే ఏమీ లేదు.

మొన్న మా ఇంటికి ఒకరు వచ్చారు. అహంభావన ఉండకూడదు అని ఆమె చెపుతున్నారు. మాకింక పోలేదు అని చెప్పాను. అహంభావన పోగొట్టుకోవాలి అని చెపుతూనే ఆమె ఏమన్నారు అంటే నేను ఇంతటిదానిని ఎలా అయ్యానని మీరు అనుకొంటున్నారు అంది. అంతకుమించిన అహంభావన ఏముంది అంటే ఎంత బుడబుక్కల జనం ఉన్నారో మనకు తెలుస్తుంది. ఆవిడ భగవద్గీత చదివారు, ఉపనిషత్‌లు చదివారు కాని అహంభావన లోపల ఉంది. నేను ఇంతటి దానిని ఎలా అయ్యాను అంటే ఆవిడ అహంభావన బలిసిందా లేక అహంభావన తగ్గిందా? లోపల ఉన్న వస్తువు ఒకటిగానే ఉంది. అది పెద్దది కాదు, తక్కువది కాదు, దానికి హెచ్చుతగ్గులు లేవు, ఈ విషయాలకు దానికి ఎట్టి సంబంధం లేదు. నేను ఇంతటి దానిని అయ్యాను అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సు చెపుతోంది. అంటే నీకు మనో నాశనం అవ్వలేదు, ఇంక నీకు జ్ఞానం ఎలా కలుగుతుంది. మీరు బేసిక్‌గా ఎన్ని పుస్తకాలు చదివినా లోపల ఉన్నది ఏదో రూపంలో బయటకు వచ్చేస్తుంది. తల్లికడుపులో నుండి బిడ్డ బయటకు వచ్చి మొదటిసారి గాలి పీల్చుకొనేటప్పుడు అంతా కంగారు, అయోమయయంగా ఉండి ఏడుస్తాడు. అలాగే చనిపోయేటప్పుడు ఆ చివరిశ్వాస పోయేటప్పుడు కూడా ఏడుస్తాడు. తేనెటీగలు కుట్టినట్లు లోపల ఉన్న వాసనలు, సంస్కారాలు బుర్రలోనికి వచ్చి కుట్టేస్తాయి, ఆ క్షోభలో సడన్‌గా ఎప్పుడో ప్రాణం బయటకు పోతుంది. అష్టావక్రగీత అని ఒక గీత ఉంది, అది మీకు దొరికితే చదవండి, అష్టావక్రుడి తండ్రి చాలా గొప్పపండితుడు. అష్టావక్రుడు తల్లి కడుపులో ఉన్నాడు, ఈయన తండ్రికంటే పండితుడు, పూర్వజన్మలలోనే నేర్చుకొన్నాడు. తండ్రి వేదం చదువుతున్నాడు, అష్టావక్రుడు తల్లి కడుపులోనుండే వింటున్నాడు. తండ్రి చదివేటప్పుడు స్వరంలో తప్పులు వస్తున్నాయి. వాడు లోపల నుండే నాన్నా నీవు చదువుతున్నావు చదివేది నీకు అర్థమవుతోంది

గాని ఆ స్వరం ఎలా ఉండాలి అని నీకు తెలియటం లేదు అని చెప్పాడు. వాడు ఇంకా పుట్టలేదు. తల్లికడుపులో నుండే ఈ మాటలు చెప్పాడు. చెప్పినవాడు ఎవడు ఆయన కొడుకే కాని ఆయనకు కోపం వచ్చింది. వీడు ఎవడు నాకు చెప్పటానికి, నేను గొప్ప వేదపండితుడిని, నన్ను ఆక్షేపిస్తావా, నువ్వు అష్ట వంకరలతో పుట్టుగాక అని కొడుకుని శపించాడు అంటే ఆయనలో ఉన్న కోపం అది. ఇంక వేదపండితుడు ఏమిటి? వాడు అష్టవంకరలతో పుట్టాడు. వేదం పారాయణ చేసేటప్పుడు అర్థం ఒక్కటే ముఖ్యం కాదు, స్వరం కూడా ఉండాలి. ఇలా సవరించుకోమని చెప్పాడు అందులో తప్పు ఏముంది, పరుషవాక్యాలు మాట్లాడలేదు. మనకు కోపం వస్తే ఏమి చేస్తున్నామో మనకు తెలియదు, దానిని కంట్రోలు చేసుకోవటం కష్టం. తరువాత తండ్రి పండితులతో ఓడిపోయి జైలుకు వెళతాడు, అష్టావక్రుడు తండ్రిని విడిపిస్తాడు. ఏదో కోపంలో అలా చేసాను అని, అష్టవంకరలు ఎలా పోతాయో మరల తండ్రే ఉపాయం చెపుతాడు. అంటే అంత పండితుడికి కూడా సడన్‌గా ఉద్రేకం వచ్చేసింది అంటే కోపాన్ని నిగ్రహించుకోవటం చాలా కష్టం.

మీరు ఎవరికైనా ఒక మామిడిపండు ఇచ్చారు అనుకోండి. నేను వారికి మామిడి పండు ఇచ్చాను అనుకొంటే వారు వేరు అని నువ్వు అనుకొంటున్నావు కదా, అది ఎల్.కె.జి. స్టాండర్డ్ అని తుకారాం చెప్పాడు. మీరు ఉన్నదేమో ఎల్.కె.జి.లో ఉన్నారు, కాని పి.హెచ్.డి. అయిపోయిందని మీరు అనుకొంటున్నారు. మనకు నెగిటివ్ థింకింగ్ ఉండకూడదు, పాజిటివ్ థింకింగ్ ఉండాలి. ఈ మధ్యన ఒక చెల్లెలు తల్లితో అంటోంది నాకు ఏమీ పెట్టటం లేదు, అక్కకు పెట్టేస్తున్నారు అంటోంది. ఆ తల్లి ఏమి చెపుతోంది అంటే అక్కకు పెట్టేశాం అని ఏడవకు, నాకు కావాలి అని ఏడువు అని చెపుతోంది. ఇతరులకు పెట్టేసారు అని ఏడవటం నెగిటివ్ థింకింగ్. నాకు కూడా కావాలి అని అడుగు, అది పాజిటివ్ థింకింగ్. ఎదుటివారికి ఇచ్చిన దానికోసం ఏడవకు, నీకు పెట్టమని అడుగు. మనిషిని బాగుచేయటం కృష్ణుడికి ముఖ్యం, ఎదుటివారు ఏమనుకొంటున్నారు అనేది ఆయనకు అక్కరలేదు. భారతంలో ధర్మరాజు చేత అబద్ధాలు చెప్పించాడు, ఆయన అబద్ధాలు చెప్పాడు, ఆడిన మాట తప్పాడు అంటే ఆయన అబద్ధాలకోరు కాదు, ఆయన దేవదేవుడు. కృష్ణుడి ఉద్దేశ్యం ఏమిటి అంటే మీ చేతి మీద పుండు ఉంది అనుకోండి ఆ పుండును తగ్గించాలి అనుకొన్నాడు అనుకోండి నిజం చెప్పటంకంటే అబద్ధం చెప్పటం వలన ఆ పుండు తొందరగా తగ్గిపోతుంది అని ఆయన అనుకొంటే అబద్ధమే చెప్పేవాడు. అంటే లోపల హృదయం గ్రహించాలి. ఆ పుండు తగ్గటం ముఖ్యం. కృష్ణుడు అబద్ధం చెప్పాడు అని మీకు పైకి అనిపించవచ్చు కాని మీరు బాగుపడటం ఆయనకు ముఖ్యం, అందుచేత ఆయన దేవుడు అయ్యాడు. మనం ఏమి చేస్తాము అంటే ఆ పుండును తగ్గించటం

మానేసి, ఆ పుండు మీద కారం చల్లుతాము, అందుచేత మనం జీవులం అయ్యాము.

వారు మంచివారు, వీరు చెడ్డవారు అలా అనుకొంటూ నీ మనస్సును బాహ్యముఖానికి వెళ్ళనివ్వవద్దు. నిన్ను నీవు చూసుకో. నిన్ను నీవు కరెక్టు చేసుకో. నిన్ను నీవు బాగుచేసుకోవటం మానేసి వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అనుకొంటూ ఉంటే నీ కాలం వృథా అవుతుంది, ఈ లోపుగా నీ శరీరానికి చావు వస్తుంది. నువ్వు సరియైన మార్గంలో ఉన్నావా, నీకు వచ్చే తలంపులు ఎలా ఉంటున్నాయి అనేది ఎప్పటికప్పుడు చూసుకో. నీవు రైట్‌పాత్‌లో ప్రయాణం చేస్తూ ఉంటే, నీకు రైట్ థింకింగ్ ఉంటే ప్రపంచంలో నీకు శాంతి కనిపిస్తుంది కాని అశాంతి కనబడదు. ఈ జన్మలో మనం ఏదో ఒకటి సంపాదించుకొంటాము, అందులో సుఖం లేదు, శాంతి లేదు అని దైవానుగ్రహం వలన మనకు తెలిసి మరల ఏదో జన్మలో అవి వదిలించుకొంటేనే గాని మనకు శాంతి కలుగదు. కొంతమంది ఏదో వస్తుందని ధనవంతుల కూడా తిరుగుతారు. వీడికి వచ్చేది ఏమీలేదు, వాడి అలవాట్లు వస్తాయి. చివరకు అశాంతి మిగులుతుంది. అంటే ధనవంతులను ద్వేషించమని చెప్పటంలేదు వారి దగ్గర నుండి ఏదో వస్తుంది, ఏదో సమాజానికి చేస్తారు అని ఎప్పడూ కనిపెట్టుకొని ఉండవద్దు. మన శరీరానికి చావు వచ్చేలోపు మన మనస్సును మనం జయించలేము అనుకోండి మనకు వందకోట్లు డబ్బు ఉన్నా మనకు శాంతి లేదు, మనం ఓడిపోయినవారితో సమానము. మీకు మనస్సు ఉన్నంతకాలం శరీరాలు వస్తూ ఉంటాయి, మనోనాశనం అయినవాడికి ఇంక శరీరాలతో పనిలేదు. బంధువులు, బంధువులు అంటారు, మా బంధువులకు చాలా డబ్బు ఉంది అంటారు. అంటే మనకేదో వారు ఉపకారం చేస్తారని ఆసక్తి ఉంటుంది, ఆసక్తి మనలను పీడిస్తూ ఉంటుంది. మన కుటుంబ సభ్యులతోగాని, సమాజంతోగాని మన అనుబంధం అహంకార రహితంగా ఉందో లేదో చూసుకోవాలి. ఆ అనుబంధం అహంకార రహితంగా ఉంటే అహంకారం తగ్గుతుంది లేకపోతే అహంకారం పెరిగిపోతుంది.

మనం పాడైపోవటానికి చాలామటుకు గుర్తింపులు కారణం. ఈ గుర్తింపుల వలన దేహబుద్ధి పెరుగుతుంది. అంటే ఏది పోగొట్టుకోవాలో అది పెరిగిపోతుంది, మనకు మోక్షం ఇచ్చేవాడు గుర్తించాలి కాని బయట వ్యక్తులు గుర్తిస్తే ఏముంది? అందుచేత లోకానికి సంబంధించిన గుర్తింపులు అనవసరం. ఒక పని అయిపోవటమే ముఖ్యం కాదు, ఆ పని సాధించటానికి మీరు చేసే ప్రయత్నం సరిగ్గా ఉండాలి, మీ మార్గం సక్రమంగా ఉండాలి, అప్పడే ముగింపు సుఖాంతం అవుతుంది. నీవు చెడుమార్గంలో ప్రయాణించి ఒక మంచి పని సాధించినా అది నిన్ను సుఖపెట్టదు. అందుచేత గమ్యం ఎంతముఖ్యమో దానిని అనుసరించే మార్గం కూడా అంతే ముఖ్యం. మధ్వాచార్య సాంప్రదాయంలో ఇదే చెపుతారు. నువ్వు మోక్షం

కోసం ఎదురుచూడవద్దు, నీ ప్రవర్తన, నీ ఆలోచనా విధానం సరిగ్గా ఉండేలా చూసుకో. నిన్ను నీవు సంస్కరించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎప్పుడో ఆ కాలం వచ్చినప్పుడు నారాయణుడిలో ఐక్యం అవుతావు, దానికోసం ఎదురుచూడవద్దు. గమ్యానికంటే సాధనకు ఎక్కువ ప్రాముఖ్యత ఇయ్యి. సాధనకు ప్రాముఖ్యత లేకుండా, సదాచారం లేకుండా, నీ ప్రవర్తన సరిగ్గా లేకుండా నారాయణుడిలో ఎప్పుడు ఐక్యమైపోవాలి, మోక్షం ఎప్పుడు వచ్చేస్తుంది అని అనుకోవటం వలన ప్రయోజనం లేదు అని మధ్వాచార్యుడు చెప్పారు. మనం భగవంతుడికంటే భిన్నంగా ఉన్నాము అని అనుకొంటున్నాము కాని భగవంతుడికంటే మనం భిన్నంగా లేము. భిన్నంగా ఉన్నాము అని అనుకోవటం వలన మనకు అశాంతి వస్తోంది.

దుఃఖము వచ్చినవాడు నేను దుఃఖపడుతున్నాను అంటాడు. సుఖపడేవాళ్ళు మా రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి, నేను సుఖపడిపోతున్నాను అంటాడు. వాడు దుఃఖంతో బంధింపబడుతున్నాడు, వీడు సుఖంతో బంధింపబడుతున్నాడు. ఏ నేను అయితే అటు అలాగ, ఇటు ఇలాగ బంధింపబడుతోందో ఆ నేను నుండి విడుదలపొందటమే మోక్షం. మీరు అలా కూర్చోండి, యోగాభ్యాసాలు ఏమి చెయ్యవద్దు, ఊరికే చెప్పింది వినండి. అంతకంటే అదనంగా ఏమీ చేయవద్దు. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అని అనుకొంటున్నారు కదా, ఆ భావనలో నుండి బయటకు రండి, మీరు భరించలేనంత సుఖం, శాంతి వచ్చేస్తుంది. అప్పుడు మిమ్మల్ని సుఖం బంధించదు, దుఃఖం బంధించదు. మన బిహేవియర్ ఇంపెర్సనల్‌గా ఉండాలి. నువ్వు కనబడకూడదు, పని కనిపిస్తూ ఉండాలి. మనం చేసే పని ఎలా ఉంటుంది అంటే మనం కనబడుతూ ఉంటాము, పని కనబడదు. పెళ్ళిళ్ళలో చూడండి కష్టపడి పనిచేసేవారు యజమానికి కనబడరు, ఎవరైతే నటిస్తున్నారో వారు యజమాని చుట్టూ తిరుగుతూ ఉంటారు. నీవు, నేను అనే వేరుబుద్ధి లేకుండా నువ్వు పని చేస్తూ ఉంటే నీ మనస్సులో ఉన్న దోషాలు అన్నీ పోతాయి, నీ మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, మనస్సు శుద్ధి అవుతుంది, ఈశ్వరుని అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు, ఈశ్వరుడి యొక్క అనుగ్రహానికి ఎప్పుడైతే పాత్రుడవు అయ్యావో ఈశ్వరుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నన్ను ఎక్కడ ఉండమంటారు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగితే నేను అనే తలంపు నీకు ఎక్కడ నుండి వస్తోందో అక్కడే నువ్వు ఉండు అని చెప్పారు. నాకు అజ్ఞానం పోవాలి, నాకు అజ్ఞానం పోవాలి అంటే పోదు. ఈ అజ్ఞానం ఎవరికి? దేహగతమైన నేనుకే అజ్ఞానం ఉంది. దేహగతమైన నేను పోయినప్పుడు అజ్ఞానం కూడా పోతుంది. పైపైకి ఎగిరేవాడికి జ్ఞానం రాదు. లోతులలోనికి వెళ్ళేవాడికే జ్ఞానోదయం అవుతుంది. మనకు జ్ఞానం కావాలంటే పైకి ఎగరటం కాదు, హృదయం యొక్క లోతులలోనికి వెళితే అప్పుడు మనకు జ్ఞానోదయం అవుతుంది.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | |
|---|---|
| మే 9 | ఆత్రేయపురం |
| మే 13 - మే 24 | అరుణాచలం క్యాంపు |
| మే 31 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## భ్రమల - భ్రమరాలు (రమణాశీస్సులతో)

ఏం తెలుసు నీకు? ఏం తెలుసు నీకు?
నిజాలు అబద్ధాలుగా అబద్ధాలు నిజాలుగా
భ్రమింపే భ్రమరాలు ఉన్నంత వరుకు ... ఏం ...

అస్తమిస్తున్న సూర్యుడ్ని చూసి భ్రమిస్తావు నీవు అస్తమించెస్తున్నాడని
కాని ఆవల తీరాల్లో ఉదయిస్తున్నాడన్నది మరుస్తావు నీవు
మరుస్తావు నీవు మరుస్తావు నీవు
చీకట్లను చూసి మరుస్తావు నీవు
అది వెలుగు అవరోధపు నీడే అన్నది మరుస్తావు నీవు ... ఏం ...

మురుస్తావు నీవు మురుస్తావు నీవు
తరిగిపోవాల్సిన ఈ జీవితాన్ని చూసి
కరిగిపోయే ఈ ఆస్తులను చూసి
శాశ్వతాలని మురుస్తావు నీవు
కాని మరుస్తావు నీవు నిజమైన శాశ్వతానందమైన ఆత్మసాక్షాత్కారాన్ని ... ఏం ...

కష్టం, సుఖం, నష్టం, ఆనందం, ప్రేమ, పగ,
ఆప్యాయత, ఆశ, ఆశయాలు, అందం, వికారం,
తప్పు, ఒప్పు, భావం, అనుభవం, భయాలు, భ్రమలు, మరి ఏవేవో, ఎన్నెన్నో
అన్నీ నీవిగా భ్రమిస్తావు, ఆ భ్రమల్లోనే జీవిస్తావు,
కాని అవన్నీ నీ మానసికపు వికారపు ప్రకంపనాలన్నది మరుస్తావు నీవు ... ఏం ...

నిన్ను నీవుగా తెలుసుకో, నిజంలో జీవించు
నీలో ఉన్న ఆ “నేను” తెలిసిన నాడు ఈ భ్రమల భ్రమరాలు నీ దరిచేరవు...

**పట్టాభిరామయ్య, నాగపూర్**

# అహం వృత్తి పూర్తిగా నశిస్తే - అహం స్ఫురణ కలుగుతుంది

వేల జన్మల నుంచి మనం గడించుకొన్న వాసనల గుంపే, అహంవృత్తి. అది కోరికలను, ఆశ ద్వేషాలను పుట్టిస్తున్నాయి. వాటి ప్రభావం వల్ల వ్యక్తి సహజ స్వరూపాన్ని మర్చిపోయి బాహ్య వస్తుమయ ప్రపంచంలో ఆనందాన్ని అన్వేషించటానికి శ్రమిస్తాడు. తన కర్మల లోంచి పుట్టే దుఃఖమే మండుటెండ వలె వ్యక్తిని కాల్చి వేస్తున్నాయి. స్వార్థానికి లొంగేవారి భావాలు నరకం కంటే అధమమైనవిగా చేస్తున్నాయి. క్షుద్ర వాంఛల వల్ల భయంతో వారి సంకెళ్లను వారే పోత పోసుకొంటున్నారు. మృత్యు సమయంలో ఆ దేహంలో ఇముడ్చుకొన్న మనస్సు అనే నీటిని మరో దేహంలోకి మారుస్తున్నాడు ఈశ్వరుడు. అహం స్ఫురణ కలగాలంటే కోరికలు అనే మురికి గుడ్డను, మనస్సు అనే చింపిరి గుడ్డను విసిరి పారేయాలి. మనం కోరే శాశ్వతానందం, పరిమితమైన విషయ భోగాల వల్ల లభించదనే జ్ఞానం కలిగి వైరాగ్యంతో స్థిరపడితే మానసిక కల్లోలాలను శాంతింపచెయ్యగలుగుతాము. వివేక, విజ్ఞానాల వర ప్రసాదాలే శాంతి, సమతలు. తన బుద్ధి ఎంతో విలువైనది అనే భావాలను విడనాడాలి. మనం చేసే సాధనలు అన్నీ మనః కల్పితాలు కావటం వల్ల మన మనస్సు చిరంజీవిగానే ఉంటుంది - ఉంచుతుంది. జ్ఞాని ఆత్మే నేను అని, నామ రూపాలతో వేరుగా తెలియబడుతున్న నిప్పు రవ్వలు ఆత్మ జ్వాలలో భాగమే అని, అవి చైతన్యానికి భిన్నం కావని తెలుసుకొంటూ శాంతంగా ఉంటాడు. శ్రీ నాన్నగారు “నామ రూప క్రియలను తీసివేస్తే ప్రపంచమే లేదు, అంతా బ్రహ్మమే. కర్మానుభవం వీస మాత్రం ఉన్నా బ్రహ్మానుభవం కలుగదు” అన్నారు. సత్యమైన జ్ఞానాన్ని విన్న తరువాత కూడా మనో భ్రమలను విడనాడలేరు. కారణం అంతరంగంలో విషయ వాంఛలనే విత్తనాలు ఉంటూనే ఉంటాయి. అవి సరియైన అదనులో మొలకెత్తి వృక్షాలు అవుతాయి. అణచిపెట్టబడ్డ మనస్సు అపూర్వంగా విజృంభించి అతనిని సామాన్యుని కన్న హీనంగా మార్చివేస్తాయి. ఆత్మానుభవంలో మాత్రమే అంతఃకరణ అదృశ్యమౌతుంది. మనం వస్తువులను మనస్సు కల్పించే ఊహలతోనే చూస్తాము. అసలు సత్యం చూడలేకపోతున్నాము. నేను కర్తను అనే భావం ఎవరికి వారు ప్రయాసపడి తొలగించుకొని, అంతం చేస్తే ముక్తస్థితికి చేరుతాము. దానికి గురు అనుగ్రహం ప్రధానం.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం